## లంచగాండుల వివరాలు ఎసిబికి తెలపండి

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఎసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

వివరాలకు:

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001
ఫోన్: (040) 2475132,



# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY

తెలుగు దినపత్రిక


## ఉచితంగా మందులు పంపిణీ

హనుమకొండ : ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వడ్డేపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం డాక్టర్ మాలిక ఆధ్వర్యంలో వడ్డేపల్లి హోమియో డిస్పెన్సరీ (చమాన్) ఆవరణంలో నిర్వహిస్తున్న, ప్రత్యేక వైద్య శిబిరమును హనుమకొండ డిఎంహెచ్వో డాక్టర్ ఏ. అప్పయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానికంగా వైద్యాధికారులు, సిబ్బంది సేవలు రెగ్యులర్గ అందిస్తున్నప్పటికీ, ఆరుగురు స్పెషలిస్ట్ వైద్య నిపుణులు గైనకాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, చిల్డ్రన్, డెంటిస్ట్, సేవలందిస్తున్నారని, అందువలన ఈ శిబిరం ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు.మెరుగైన సేవల నిమిత్తం డాక్టర్లు రిఫర్ చేసిన వారి వివరములు, తమ వద్ద విడివిడిగా నమోదు చేసుకోవాలన్నారు. ఎన్సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్ శిబిరాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు.


నల్లగొండ సంపుటి:16 సంచిక:76 ఎడిటర్: సయ్యద్ పాష 01-04-2026 బుధవారము పేజీలు :8 వెల:1/-


# అసోంలో బీజేపీ మేనిఫెస్టో.. మహిళలకు పెద్దపీట




అసోం : అసోం 2026 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికార బీజేపీ మ్యానిఫెస్టో విడుదల చేసింది. మొత్తం 31 హామీలతో జాబితాను విడుదల చేసింది. ఇందులో మహిళల సాధికారతకు పెద్దపీట వేసింది. మహిళలకు 'ఒరు నోదోయ్' పథకం కింద నగదు సహాయాన్ని రూ.3000కు పెంచుతామని హామీ ఇచ్చింది. అలాగే, లఖ్ పతి దీదీ పథకం ద్వారా 40 లక్షల మహిళలను లక్షాధికారులుగా తయారు చేసేందుకు రూ.25,000 చొప్పున ఆర్థిక సాయం అందిం చనున్నట్లు తెలిపింది. అసోంను అత్యంత ప్రకాశవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే బీజేపీ లక్ష్యమని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ పేర్కొన్నారు. మంగళవారం గువహటిలో అసోం అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మ్యానిఫెస్టోను కేంద్రం ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తో కలిసి హిమంత విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో బీజేపీ ప్రధాన అజెండాగా యూనిఫాం సివిల్ కోడ్ (యూసీసీ) అమలు చేస్తామని హిమంత ప్రకటించారు. అయితే రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ పరిధిలోని గిరిజన ప్రాంతాలకు ఇది వర్తించదని ఆయన స్పష్టం చేశారు. అలాగే లవ్ జిహాద్ పేరుతో జరుగుతున్న ఘటనలపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని వరదల నుంచి విముక్తి కల్పించేందుకు తొలి రెండు సంవత్సరాల్లోనే రూ.18,000 కోట్లను ఖర్చు చేయనున్నట్లు చెప్పారు.'అసోంను అభివృద్ధి పథంలో నడిపించడమే మా లక్ష్యం'ఉద్యోగాల నియామకం గురించి కూడా హిమంత ప్రస్తావించారు. రాబోయే ఐదేళ్లలో దాదాపు 2 లక్షల ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కాలేజీ, యూనివర్సిటీ, ఇంజినీరింగ్ కాలేజీలను ఏర్పాటు చేస్తామన్నారు. మ్యానిఫెస్టో కార్యక్రమంలో ముఖ్యమంత్రి హిమంతతో పాటు కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్ , సర్బానంద సోనోవాల్ , రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు దిలీప్ సైకియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురక్షితమైన, అసోంను అభివృద్ధి పథంలో నడిపించడమే తమ లక్ష్యమని దిలీప్ సైకియా పేర్కొన్నారు. అయితే, ఎన్నికల ప్రణాళిక రూపకల్పన కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాం తాల ప్రజల నుంచి దాదాపు 2.45 లక్షల సూచనలు సేకరించి ఈ మేనిఫెస్టో రూపొందించినట్లు ఆయన తెలిపారు.'నేడు అసోంలో శాంతి పరిస్థితులు నెలకొన్నాయి' మరోవైపు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా మాట్లాడారు. "గతంలో కాంగ్రెస్ పాలనలో ఎన్నో అవాంతరాలు జరిగాయి. కేవలం 2007లోనే 474 దాడులు జరిగాయి. అందులో 287మంది పౌరులు మరణించారు. కానీ, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గణనీయంగా మార్పులు వచ్చాయి. నేడు అసోంలో శాంతి పరిస్థితులు నెలకొన్నాయి. సంక్షేమ కార్యక్రమాలు బృహత్తర స్థాయిలో అమలవుతున్నాయి. నేడు, అసోంలోని 81.65 శాతం గృహాలు 'జల్ జీవన్ మిషన్' తాగునీటి పథకం పరిధిలోకి వచ్చాయి. అలాగే అసోంలో కేవలం నాలుగేళ్లలోనే గణనీయమైన వృద్ధి నమోదు అయ్యింది" అని నిర్మలా పేర్కొన్నారు. 5 హామీలను ప్రకటించిన కాంగ్రెస్ ఇదిలా ఉండగా, అసోం విపక్ష కాంగ్రెస్ కూడా ఐదు హామీలను ఆదివారం ప్రకటించింది. ఇందులో మహిళలకు నెలవారీ నగదు బదిలీ, వృద్ధులకు రూ.1,250 పెన్షన్, ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు వంటి ఐదు ప్రధాన గ్యారెంటీలను వెల్లడించింది. అదేవిధంగా, 100 రోజుల్లోగా ప్రముఖ గాయకుడు, గేయ రచయిత జుబీన్ గార్గ్ మరణానికి న్యాయం చేయడం వంటి అంశాలు ఉన్నాయి. ఈ మేరకు అసోం కాంగ్రెస్ ఎక్స్ లో పోస్ట్ చేసింది.కాగా, అసోంలో మొత్తం 126 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 9న ఒకే దశలో పోలింగ్ జరగనుంది. ఓట్ల లెక్కింపు మే 4న నిర్వహిం చనున్నారు. అధికార బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ కూటమి, కాంగ్రెస్ పార్టీ మధ్య హోరాహోరీగా పోరు కొనసాగుతోంది. వరుసగా మూడోసారి అధికారాన్ని దక్కించుకోవాలని బీజేపీ లక్ష్యంగా పెటుకుంది. మరోవైపు, అధికార పార్టీని ఓడించి మళ్లీ అధికారంలోకి రావాలని విపక్ష కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది.

# సిద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టింది



కన్నూరు: కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్, బీజేపీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టిందని ఆరోపించారు. అందువల్లే ఈ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ గెలవాలని మోదీ కోరుకుంటున్నారని అన్నారు. బీజేపీతో కూడిన ఎల్డీఎఫ్కు, కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్కు మధ్యే ఎన్నికల పోరాటం జరుగుతోందన్నారు. కన్నూరులో మంగళవా రంనాడు జరిగిన ఎన్నికల ప్రచా ర సభలో రాహుల్ మాట్లాడారు. స్వతం త్ర అభ్యర్థులుగా పోటీచేస్తున్న సీపీఎం మాజీ నేతలు వి.కున్హికృష్ణన్, టీవీ గోవిందన్లు కూడా రాహుల్ ప్రసంగించిన వేదికపై పాల్గొన్నారు.ఈ ఎన్నికలు రెండు సిద్ధాంతాలకు మధ్య జరుగుతున్న పోరని, తొలిసారి బీజేపీ-లెఫ్ట్ ఫ్రంట్ చేతులు కలపడం అంతా చూస్తున్నామని రాహుల్ అన్నారు. బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టడం ఇష్టంలేకనే ఆ పార్టీలోని కొందరు సీనియర్లు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని చెప్పారు. లెఫ్ట్ ఫ్రంట్ ఇంకెంతమాత్రం వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్వింగ్ పార్టీ అని పేర్కొన్నారు.శబరిమలపై ఎందుకు మౌనం?ప్రధానమంత్రి ఎక్కడకు వెళ్లినా ఆలయాలు, మతం గురించి మాట్లాడతారని.. కానీ ఇక్కడకు వచ్చిన ప్పుడు మాత్రం శబరిమల ఆలయంలో బంగారం తాపడాలు మాయం కావడంపై ఎందుకు మాట్లాడటం లేదని రాహుల్ ప్రశ్నించారు. రాష్ట్రంలో లెఫ్ట్ ఫ్రంట్ తిరిగి గెలవాలని ఆయన కోరుకుంటున్నారని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం లేదని అన్నారు. సీపీఎంను బీజేపీ కంట్రోల్ చేస్తోందని, యూడీఎఫ్ను మాత్రం కాదని చెప్పారు. తనకు సవాల్ విసరగలిగే సత్తా కాంగ్రెస్కు మాత్రమే ఉందనే విషయం మోదీకి బాగా తెలుసునని అన్నారు. మోదీని కాంగ్రెస్ ప్రతిఘటించడం అందరికీ తెలుసునని, కానీ మోదీని కేరళ సీఎం కానీ, కేరళ సీఎంను మోదీ కానీ విమర్శించడం ఎవరూ విని ఉండరని రాహుల్ అన్నారు.

# బిహార్ గుడిలో తొక్కిసలాట- 8 మంది భక్తులు మృతి



బిహారం : బిహార్లోని నలందలో ఘోర విషాదం జరిగింది. శీతలామాత ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 8 మంది మహిళలు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం జరిగిన ఈ ఘటనలో భారీగా భక్తులు ఒక్కసారిగా గుమిగూడటంతో తీవ్ర రద్దీ ఏర్పడి, ఆందోళనలో ఒకరిపై ఒకరు పడి పోవడంతో ప్రమాదం సంభవించినట్లుగా తెలుస్తోంది.అధిక రద్దీ కారణంగా ప్రమాదంనలంద జిల్లాలోని మాఘ్రా గ్రామంలోని శీతలామాత ఆలయానికి ప్రతి మంగళవారం భక్తులు వస్తుంటారు. అయితే ఈసారి మహావీర జయంతి, చైత్ర మాసం చివరి మంగళవారం కావడంతో ఆలయానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. ఉదయం 9 గంటల నుంచి భక్తుల రాక పెరుగుతూ వచ్చింది. ఉదయం సుమారు 10:30 గంటల సమయంలో ఒక్కసారిగా రద్దీ పెరగడంతో భక్తులు ఒకరిపై ఒకరు పడిపోవడంతో తొక్కిసలాట జరిగింది. ఘటన సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, స్థానిక గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఎక్స్గ్రేషియా ప్రకటించిన మోదీ,సీఎంఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం ప్రకటించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ కూడా సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.6లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. మరోవైపు ఈ ప్రమాదంపై ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ, ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందిస్తుందని చెప్పారు. గాయపడిన వారికి సరైన చికిత్స కోసం ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్లో పోస్ట్ చేశారు.

# అకాల వర్షాలు - చేతికందిన పంట నేలపాలు



నిజామాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా రాత్రి కురిసిన అకాల వర్షం రైతులను నిండాముంచింది. కళ్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ఈదురు గాలులకు వరి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. చేతికందొచ్చిన మామిడి పంట సైతం నేల పాలయింది. ఆరుగాలం ఎండనకా వాననకా పడిన కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరయ్యిం దని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని వేడుకుం టున్నారు.రైతులను ఆగం చేసిన వర్షం : రాత్రి కురిసిన అకాల వర్షానికి అన్నదా తలు కుదేలయ్యారు. నిజామాబాద్ జిల్లాలో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం అన్నదాతను ఆగమాగం చేసింది. కళ్లాల్లో ఆరబోసిన పసుపు, ఎర్ర జొన్న, జొన్న, మొక్కజొన్న తడిసి ముద్దయ్యాయి. ధర్పల్లి, సిరికొండ మండలాలలో కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. ఈదురుగాలులకు మొక్కజొన్న, వరి పంటలు నేలకొరిగాయి. చేతికొచ్చిన మామిడికాయ పంట నేలపాల య్యింది.ఇవాళ, రేపు ఉరుములు మెరుపులతో కూడిన వడగండ్ల వర్షం కురిసే అవకాశం రాష్ట్రంలో ఇవాళ, రేపు ఉరుములు మెరుపులతో కూడిన వడగండ్ల వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అంచనావేస్తోంది. ఈ ప్రభావంతో ఇవాళ ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. రేపు కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఇవాళ, రేపు హైదరాబాద్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని, రాత్రి వేళల్లో ఉక్కపోత వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

# నలుగురు సైనికులు మృతి



లెబనాన్: దక్షిణ లెబనాన్లో హిజ్బుల్లా గ్రూపుతో జరిపిన పోరాటంలో నలుగురు సైనికులు మృతి చెందినట్లు ఇజ్రాయిల్ సైన్యం మంగళవారం (మార్చి 31) ధృవీకరించింది. మృతి చెందిన వారు కెప్టెన్ నోమ్ మద్మోని, సార్జెంట్ బెన్ కోహెన్, సార్జెంట్ లిరాన్ బెన్ జియోన్, సార్జెంట్ మాక్సిమ్ యాంటిస్గా గుర్తించారు. ఈ మరణాలతో యుద్ధంలో మరణించిన సైనికుల సంఖ్య పదికి చేరింది.

# రూ. 4 కోట్లతో పులే విగ్రహాలు ఏర్పాటు



హైదరాబాద్: ట్యాంక్ బండ్ ఐమాక్స్ థియేటర్ ఎదురుగా లేక్ వ్యూ పార్క్ వద్ద ఏప్రిల్ 11 వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదిగా ప్రారంభించుకునే మహాత్మా జ్యోతిబాపూలే,సావిత్రి బాయి పూలే విగ్రహ నిర్మాణ పురోగతి పనులను మంత్రి కొండా సురేఖతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... ప్రగతి భవన్ ను జ్యోతి బాపూలే ప్రజాభవన్ గా మార్చుకున్నామని తెలిపారు. లేక్ వ్యూ పార్క్ మార్గాలన్ని పూలే మార్గ్ గా మార్చాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారని తెలిపారు. పూలే మార్గ్ గా పేరు మార్పుపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. రూ. 4 కోట్లతో పులే విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రెండు రోజుల ముందే విగ్రహ ఏర్పాటు పనులు పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సభ ప్రాంగణంలో ఎవరికి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత విహెచ్ , ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కవ్వంపల్లి సత్యనారాయణ, నవీన్ యాదవ్, కాలేరు వెంకటేష్ , ముఠా గోపాల్ , బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ , మాజీ మేయర్ గద్వాల విజయ లక్ష్మీ, కార్పొరేషన్ చైర్మన్ లు, నూతి శ్రీకాంత్ గౌడ్ ,మెట్టు సాయి కుమార్, జెరిపాటి జైపాల్ , బీసీ సంఘాల నేతలు జాజుల శ్రీనివాస్ గౌడ్ ,దాసు ,బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమయాదేవి, హైదరాబాద్ కలెక్టర్, జీహెచ్ ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్లు పాల్గొన్నారు.

## లారీ ఓనర్స్ అసోసియేషన్ నిరసన..



నల్లగొండ : వాణిజ్య వాహనాల ఫిట్నెస్ సర్టి ఫికెట్ కోసం రేడియం రిఫ్లెక్సటర్ స్టిక్కర్లపై డీలర్లు, కాంట్రాక్టర్లు నిర్ణయించిన అధిక ధరల, పరిమిత వ్యవస్థపై ప్రభుత్వం పరిశీలించి వాహనదారులకు న్యాయం చేయా లని కోరుతూ మంగళవారం నల్లగొండ పట్టణంలోని నల్లగొండ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు యేన్న అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఫిట్నెస్ సర్టిఫికెట్ పొందుటకు రవాణా శాఖ నియమించిన కాంట్రాక్టర్ల ద్వారా మాత్రమే రేడియం స్టిక్కర్లు కొనుగోలు చేయవలసి వస్తుందన్నారు. దీంతో ఈ డీలర్లు నిర్ణయించిన ధరలు ఓపెన్ మార్కెట్ ధరలతో పోలిస్తే చాలా ఎక్కువగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానంతో సాధారణంగా వెయ్యి వరకు వచ్చే స్టిక్కర్లు రూ.5 వేల నుండి రూ.10 వేల వరకు వసూలు చేయబడుతున్నారు. ఈ విధానంతో ఒకటి, రెండు వాహనాలు కలిగి ఉన్న యజమానులు, స్వయం ఉపాధి డ్రైవర్లు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఈ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనియెడల లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఉద్యమాలు చేస్తామని హెచ్చరి ంచారు. అంతకుముందు ఇదే విషయ ంపై నల్లగొండ డిప్యూటీ ట్రాన్స్పోర్టు కమిషనర్ వాణికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ జావీద్, కోశాధికారి మారెడ్డి వెంకట్ రెడ్డి, బొడ్డు వెంకన్న, ఏజస్, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## శోభాయాత్రకు హరీశ్ రావును ఆహ్వానించిన ఎమ్మెల్యే



హైద్రాబాద్: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రకు హాజరు కావాలని మాజీ మంత్రి హరీశ్రావును ఎమ్మెల్యే సుధీర్రెడ్డి ఆహ్వానించారు. మంగళవారం ఎల్బీ నగర్ నియోజకవర్గం నాయకులతో కలిసి ఆయన హరీశ్రావు నివాసానికి వెళ్లి ఆహ్వానాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2వ తేదీన భారీ ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం సాయంత్రం 4గంటలకు బీఎన్రెడ్డినగర్ చౌరస్తాలో యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. అక్కడి నుంచి సాహెబ్నగర్లోని త్రినేత్రాంజనేయ దేవస్థానం వరకు శోభాయాత్ర సాగుతుందని తెలిపారు. భక్తి, శక్తి, ఐక్యతకు ప్రతీకగా ఈ కార్యక్రమం నిలుస్తుందన్నారు. హనుమాన్ భక్తులు, ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మహబూబ్నగర్ : కటింగ్ చేయిం చుకునేందుకు వచ్చి తిరిగి ఇంటికి వె ళ్లేందుకు రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తుండ గా.. వేగంగా వస్తున్న కారు ఢీకొట్టడంతో వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మహబూబ్నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని బో యిన్పల్లి గ్రామంలోని 167వ జాతీయ రహ దారిపై చోటు చేసుకుంది. స్థానికు ల వివరాల ప్రకారం.. నాగర్కర్నూల్ జిల్లా ఊ ర్కొండ మండలం బాల్యాలోక్యాతండాకు చెందిన దేవ్య(38) ఉదయం ఇంటి నుంచి తన బైక్పై బోయిన్పల్లి గ్రామానికి వచ్చి కటింగ్ చేయించుకొని రోడ్డు అవతల ఉన్న బండిని తీసుకునేందుకు దాటుతుండగా కల్వకుర్తి వైపు నుంచి వేగంగా వస్తున్న కారు దేవ్యను ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.

# దేశ టైమ్స్ సంపాదకీయం

## యూరప్‌లోని ఈ చిన్న రిపబ్లిక్‌ను 40వ దశకంలోనే కమ్యూనిస్టులు, సోషలిస్టులు కలిసి పరిపాలించారు...

కమ్యూనిస్టుల చివరికోట కేరళను సీపీఐ(ఎం) వామపక్షాలు నిలబెట్టుకుంటాయా? అనేది ఇప్పుడు మీడియాలో ప్రతిచోటా మనకు కనిపిస్తున్న శీర్షిక. దీన్ని సరైన పద్ధతిలో చెప్పాలంటే కేరళ కమ్యూనిస్టుల చివరికోట కాదు -- ఒక విధంగా మొదటి కోట. ఇంకా చెప్పాలంటే ప్రపంచస్థాయిలోనే మొదటి ఎన్నికల విజయంతో వారు ప్రభుత్వం ఏర్పరచిన మొదటి ఉదాహరణగా పేరు గాంచింది, అయితే మొదటి ముఖ్యమంత్రి ఇఎంఎస్ నంబూద్రిపాద్ స్వయంగా దీన్ని సవరించి చెప్పారు. 1950లో గుయానాలో చెడ్డీ జగన్ ఎన్నికల ద్వారా వచ్చిన మొదటి కమ్యూనిస్టు ప్రధాని అని ఇఎంఎస్ వెల్లడించారు. మనం ఇప్పుడు గూగుల్‌లో వెతికితే శాన్‌మారియో పేరు కనిపిస్తుంది. యూరప్‌లోని ఈ చిన్న రిపబ్లిక్‌ను 40వ దశకంలోనే కమ్యూనిస్టులు, సోషలిస్టులు కలిసి పరిపాలించారు. సరే ఆ చరిత్ర అలా వుంచితే భారతీయులకు తొలి కాంగ్రెసేతర కమ్యూనిస్టు ముఖ్యమంత్రిగా గుర్తుండి పోయిన నాయకుడు ఇఎంఎస్ నంబూద్రిపాద్ మాత్రమే. 1959లో ఆ ప్రభుత్వాన్ని కూలదోయడం తో సమాఖ్య విధానం కోసం మొదటి దశ పోరాటం మొదలైంది, 1964లో సీపీఐ(ఎం)గా ఏర్పడిన తర్వాత మళ్లీ 1967లో ఇతర పార్టీలతో కలసి ఆయన మిశ్రమ ప్రభుత్వం ఏర్పాటు చేశారు. 1970-79 మధ్య కాలంలో కాంగ్రెస్ సీపీఐల కలయికలో ప్రభుత్వాలు నడిచినా మళ్లీ 1980 నుంచి సీపీఐ-సీపీఐ(ఎం) ఇతర లౌకికపార్టీలు కలిసి లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్(ఎల్‌డిఎఫ్)గా కొనసాగుతూనే వున్నాయి. ఈ కాలమంతటా కేరళ రాజకీయాలలోనూ, ఎన్నికలలోనూ ప్రధాన పోరాటం కాంగ్రెస్ నాయకత్వంలోని యుడిఎఫ్‌కూ, ఎల్‌డిఎఫ్‌కూ మధ్యనే సాగుతున్నది. ఈ ఐక్యత రాజకీయ విభజన ఇలాగే కొనసాగడం వామపక్షాల సిద్ధాంత నిబద్ధతకూ, సమైక్య కార్యాచరణ స్ఫూర్తికి ఒక సజీవ నిదర్శనంగా పరిగణించాల్సి వుంటుంది. గత ఏడు దశాబ్దాల కేరళ రాజకీయాలు తీసుకుంటే పూర్తిపదవీ కాలంలో కొనసాగి రెండవసారి కూడా మళ్లీ గెలిచి మూడో దఫా పోరాటానికి నాయకత్వం వహిస్తున్న మొదటి వ్యక్తి పినరయి విజయన్ కావడం చారిత్రక విశేషం. సర్వేల సానుకూల సంకేతాలు2016-21 మధ్య మొదటిసారి ఆ ప్రభుత్వంలో వున్నప్పుడు దారుణమైన వరదలు, కరోనా కల్లోలం, నిపా వైరస్ వంటి వాటితో పాటు కేంద్రంలోని నరేంద్రమోడీ బీజేపీ ప్రభుత్వ ఘోరవివక్షను కూడా తట్టుకుని పినరయి ప్రభుత్వం మహత్తర విజయాలు సాధించింది. నిలిచిపోయిన ప్రాజెక్టుల పూర్తికి అత్యధికంగా ప్రాధాన్యత నివ్వడం, విద్యావైద్య రంగాలలో ప్రత్యేక శ్రద్ధపెట్టి సేవలందించడం, పెట్టుబడులు రాబట్టడం, కేంద్రంపై పోరాడటం నవ కేరళ నిర్మాణానికి సమగ్రమైన దార్శనిక, ప్రణాళిక రూపకల్పన వల్ల ప్రజల ఆదరాభిమానాలు పొందగలిగామని ముఖ్యమంత్రి చెబుతారు. ఇప్పుడు కూడా తాము తిరిగి అధికారంలోకి వస్తామని వామపక్షాలు గట్టి విశ్వాసంతో వున్నాయి. అయితే హ్యాట్రిక్ తనకోసం కాదనీ, కేరళ సమగ్రాభివృద్ధికి వెనకబడిన తనం నుంచి బయటకు రావడానికి అదొక్కటే మార్గమని ఆయన బలంగా చెబుతున్నారు. తాజాగా జరుపుతున్న ఎన్నికల సర్వేలు కూడా ఎల్‌డిఎఫ్‌కు అనుకూలత వున్నట్టు చెబుతున్నాయి. హోరాహోరి పోటీ వున్నట్టు చెబుతున్న సర్వేలు కూడా ఎల్‌డిఎఫ్ బలం సమానంగా చూపించడం విశేషం, ముఖ్యమంత్రి ఎవరుండాలనే ప్రశ్నకు అత్యధికులు పినరయి విజయన్ వుండటం గమనించదగ్గది. నెట్‌వర్క్ 18 జరిపిన సర్వేలోనైతే యుడిఎఫ్‌కు 68-74 స్థానాలు వస్తాయని చెబుతున్నది. కాగా ఎల్‌డిఎఫ్‌కు 64 నుంచి 70 స్థానాల వరకూ సూచించింది. ఓట్ల శాతం చూస్తే ఇరు కూటములకు సమానంగా 36శాతానికి అటూ ఇటుగా కేవలం 0.1శాతం మాత్రమే తేడా వుంటుందని చెబుతున్నది. ఎంతో ఆర్భాటం చేసిన బీజేపీ ఎన్‌డిఎలకు 14శాతం ఓట్లు ,1-3సీట్లు వస్తాయని అంచనా వేసింది. పోల్‌మంత్ర అనే మరో సర్వేనైతే ఎల్‌డిఎఫ్‌కు 33.7శాతం, యుడిఎఫ్‌కు 38.2శాతం, ఎన్‌డిఎకు ఎనిమిది శాతం ఓట్లు వస్తాయంటున్నా ముఖ్యమంత్రిగా పినరయి విజయన్ కు 38.2శాతం మద్దతు తెలిపారన్నది. మనోరమ జరిపిన ఒక చిన్న సర్వేలోనైతే అరవైశాతం మంది ఓటర్లు అభివృద్ధికోసమే ఓటేయాలని అభిప్రాయ పడటం ఎల్‌డిఎఫ్‌కు అనుకూలమని తేల్చింది. అదే సమయంలో విజయన్ నాయకత్వానికి 30.62శాతం ఓటర్లు మొగ్గు చూపగా కాంగ్రెస్ ఒక నాయకుడుగా వున్న వి.డి.సతీషన్‌కు 27శాతం మాత్రమే మద్దతు తెలిపారు. ఇక ఓట్‌వైబ్ సర్వేలోనైతే 53.7శాతం మంది ఓటర్లు పినరయి విజయన్ పట్ల స్పష్టమైన మొగ్గు కనబర్చారు. రాజకీయంగా వ్యతిరేకించేవారు కూడా కాంగ్రెస్‌లో అనైక్యతకు అవకాశమివ్వరాదని భావించినట్టు పేర్కొంది. లోక్‌పాల్ సర్వేలో యుడిఎఫ్‌కు ఆధిక్యత చూపించినా ఎల్‌డిఎఫ్‌కు దాదాపు నలభై శాతం ఓట్లు వస్తాయని చెప్పడం గమనించదగ్గది. ఇప్పుడు కూడా పన్నెండు నియోజకవర్గాలలో వెయ్యిఓట్లలోపునే తేడా వుండబోతున్నదని సర్వేలు అంచనా వేస్తున్నాయి. స్థానిక ఫలితాల హెచ్చరికకేరళ ఓట్ల విభజన, పోటాపోటీ ఎప్పుడూ తీవ్రంగానే వుంటుంది. ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్ ఒకదాని తర్వాత ఒకటి వస్తుండేవి. అయితే గత ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం గొప్ప సేవలందించి అభివృద్ధి ముద్ర వేసుకోవడం, మత సామరస్యాన్ని కాపాడటం వల్లనే రెండవసారి ఎన్నిక కాగలిగింది. ఈ కారణం వల్లనే దాన్ని మూడోసారి రానివ్వకుండా అడ్డుకోవడానికి అన్ని రకాల కుట్రదారులు చెలరేగిపోవడం స్పష్టంగా కనిపించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ జాతీయ దృష్టి లౌకిక ప్రజాస్వామ్యం కోసం పోరాటం అన్న విశాల లక్ష్యం ఏ మాత్రం చూపించకపోగా కత్తికట్టి వ్యవహరిస్తూ వచ్చారు. అనేక సందర్భాల్లో బీజేపీతో చేతులు కలిపైనా వామపక్షాలను ఓడించేందుకు తెగబడ్డారు. 2021 శాసనసభ ఎన్నికల విజయం తర్వాత వచ్చిన 2024 లోక్‌సభ ఎన్నికలలోనే ఆ ప్రభావం కనిపించింది. శాసనసభలో ప్రాతినిధ్యమే లేని బీజేపీ త్రిసూర్ సీటు గెలిచి మొదటిసారి ఒక లోక్‌సభ స్థానం పొందగలిగింది. ఓట్లలో దాని వాటా 2019లో 12.9 శాతం వుంటే 2024లో ఎన్‌డిఎ వాటా 19.2 శాతానికి పెరిగింది. ఇక 2025లో జరిగిన స్థానిక ఎన్నికలలో కూడా బీజేపీ త్రివేండ్రం కార్పొరేషన్‌ను పొందగలిగింది. కానీ ఓట్ల శాతం మాత్రం 14.7కు తగ్గిపోవడం కాంగ్రెస్‌తో స్థానిక అవగాహన ఫలితమే కావచ్చు. ఎల్‌డిఎఫ్‌కు రాజకీయంగా నష్టం కలిగింది. 577 గ్రామ పంచాయతీల నుంచి 340 పంచాయతీలకు తగ్గింది. సమితులలో 111 నుంచి 63కు తగ్గింది. జిల్లా పంచాయతీలలో 11 నుంచి ఏడుకు తగ్గింది. మునిసి పాలిటీలలోనూ 43 నుంచి 29కి తగ్గిపోయింది. మొత్తం ఓట్ల శాతంలో తేడా 5.4శాతం వుంది. స్థానిక ఎన్నికలలో తగిలిన ఈ దెబ్బను సీపీఐ(ఎం) తీవ్రంగా తీసుకొని నిష్కర్షగా సమీక్షించింది. స్థానిక ఎన్నికలకు ఇతర అంశాలు వ్యక్తిగతమైన పార్టీల పరమైన అవకాశవాద కలయికల ప్రభావం ఎక్కువగా వుంటుంది. ఇదేగాక శబరిమలై ఆలయంతో మొదలుపెట్టి ఏదో విధంగా మత తగాదాలు పెంచేందుకు హోంమంత్రి అమిత్ షా ప్రత్యక్ష పాత్రతో పథకాలు అమలు చేశారు. స్థానిక ఎన్నికలలో కనీసం 25శాతం ఓట్లు తెచ్చుకోవాలని పాచికలు వేసినా లోక్‌సభ ఎన్నికలలో కంటే తక్కువగా 16 శాతానికి తగ్గింది. స్థానిక ఎన్నికల తర్వాత ఎల్‌డిఎఫ్ ముఖ్యంగా సీపీఐ(ఎం) తీసుకున్న దిద్దుబాటు చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయని అర్థమవుతుంది. పశ్చిమ బెంగాల్‌తో పోలిస్తే కేరళలో సర్ కుట్రలు కూడా సాగకుండా ప్రభుత్వం జాగ్రత తీసుకుంది. యుడిఎఫ్‌పై అవిశ్వాసంపదేళ్లుగా అధికారానికి దూరమై దేశంలోనూ దెబ్బతిన్న కాంగ్రెస్ యుడిఎఫ్‌లు ఎలాగోలా మళ్లీ గద్దెక్కాలని అన్ని కుయుక్తులకు పాల్పడుతుండటం విమర్శకులు ప్రత్యేకంగా గమనిస్తున్నారు. బీజేపీతో సీపీఐ(ఎం) చేతులు కలిపిందనే నిందాప్రచారంతో మైనార్టీలను దూరం చేయాలని పెద్ద ప్రయత్నమే చేసింది. మీడియా కూడా అదే ప్రచారం చేసింది. ముస్లింలీగ్‌తో పాటు జమాతే ఇస్లామీని, ఎస్‌డిపిఐని కూడా కాంగ్రెస్ జట్టుకట్టింది. కాని దానివల్ల నిజంగా మైనారిటీలు యుడిఎఫ్‌వైపే వున్నట్టు నమ్మించే ప్రయత్నం ఫలించలేదు. కాంగ్రెస్ బీజేపీతో తాము చేతులు కలిపిన ఫలితంగానే వారు గెలిచిన తిరువనంతపురంలో ఓట్లు అటు ధార పోయడమే గాక నేరుగా రంగంలోవుండి ప్రచారం చేయడం ఆశ్చర్యం కలిగించింది. ఈ విధంగా రెండు రకాల మతతత్వాలతో చేతులు కలిపిన కాంగ్రెస్ నిజస్వరూపాన్ని ముఖ్యమంత్రి విజయన్ స్పష్టంగా చెప్పగలిగారు. కేరళలో కాంగ్రెస్ బీజేపీకి బి టీమ్ మాత్రమేనని ఆయన అన్నమాట సంచలనం కలిగించింది. దాంతో మరింత రెచ్చిపోయి దుర్భాషలాడుతున్న కాంగ్రెస్‌కు ఓటర్లే పాఠం చెబుతారని ఎల్‌డిఎఫ్ నేతలు గట్టిగా చెబుతున్నారు. కాంగ్రెస్‌లో విడి సతీశన్, కెసివేణుగోపాల్, శశిథరూర్ వంటి వివిధ నాయకుల మధ్య కుమ్ములాటలు బహిరంగ రచ్చగా సాగుతున్నాయి. ఈ విషయంలోనూ సీపీఐ(ఎం)లోనే కలహాలు సాగుతున్నట్టు బురదజల్లే ప్రచారం చేసినా ఏకోన్ముఖంగానే ఎన్నికల పోరాటంలోకి దూకడం ప్రత్యక్ష సమాధానమైంది. ఒకరిద్దరు నాయకులు పదవీలాలసతో నిష్క్రమించినా ఆ ప్రభావం ఎన్నికల పోరాటంపై పడకపోవడం గమనించదగింది. ఎల్‌డిఎఫ్ అభ్యర్థులలో అత్యధికులు గతం నుంచి కొనసాగుతున్నవారే కావడం యాదృచ్ఛికమేమీ కాదు. ప్రభుత్వంపైన లేదా స్థానిక ప్రజాప్రతినిధులపైన ఎలాంటి వ్యతిరేకత లేదని విశ్వాసంతోనే ఎల్‌డిఎఫ్ పోరాటానికి సిద్ధమైంది. పదేళ్ల సంక్షేమం,అభివృద్ధి పథకాలనే ప్రధానంగా ప్రచారం చేస్తున్నది. దేశంలో ఎక్కడా లేని విధంగా కేరళలో క్రైస్తవులు ముస్లింలు కలసి 47శాతం వున్నారు. హిందూత్వ రాజకీయాలు చేసే బీజేపీ వీరిలో క్యాథలిక్కులలో కొన్ని వర్గాలను దగ్గర చేసుకోవడానికి మత పాచికలు వేయడం విద్దూరంగా కనిపించవచ్చు. దేశంలో బీజేపీకి కాంగ్రెస్‌లే ప్రధాన ప్రత్యర్థులు గనక తమను ఎన్నుకోవాలని ప్రచారం చేసుకుంటున్నా వాస్తవంలో వారు బీజేపీతో చేతులు కలపడం దాచేస్తే దాగని సత్యంలా గోచరిస్తున్నది. బీజేపీ మూడోశక్తిగా రాబోతున్నదనే జోస్యాలు ఇప్పటికే వెనక్కుపోయాయి. మరోవైపున సాంస్కృతిక రంగంలోనూ పోరాటం కీలకమనే వైఖరితో సీపీఐ(ఎం) కేరళను లౌకిక భారతానికి వేదికగా మార్చింది. దక్షిణాదిన స్టాలిన్ వంటి ముఖ్యమంత్రులే గాక కమల్‌హాసన్, ప్రకాశ్‌రాజ్ వంటి లౌకిక కళాకారులు రచయితలు కూడా కేరళలో ఎల్‌డిఎఫ్ పునరాగమనాన్ని ఆకాంక్షిస్తున్నారు. దేశంలో వామపక్షాలు అధికారంలోకి వచ్చే అవకాశం గల ఒకే రాష్ట్రంగా కేరళను కాపాడు కోవాలనే ఆసక్తి దేశమంతటా వుంది. ఇరుగుపొరుగు దేశాల్లోనేగాక ప్రపంచమంతటా సాగుతున్న పరిణామాలు కూడా కేరళను ఆసక్తిగా చూస్తున్నాయి. తుది ఫలితం మే నాలుగో తేదీ స్పష్టమవుతుంది.

## కాలయాపన చేయకుండా సమస్యను పరిష్కరించాలి!

న్యూఢిల్లీ: పశ్చిమాసియా ఉద్రిక్తతలు మన వంటగదిలోనూ మంటపెట్టాయి. హర్మూజ్ జలసంధిలో చమురు రవాణాకు అంతరాయం ఏర్పడటంతో దేశంలో గ్యాస్, ఇంధనాల కొరత నానాటికీ తీవ్రమవుతోంది. వంటగ్యాస్ (ఎల్పీజీ) సిలిండర్లకు తీవ్ర కొరత ఎదురవుతోంది. ఇప్పటివరకు అదంతా హంబక్ అంటూ కొట్టి పారేసిన కేంద్ర ప్రభుత్వం ఎల్పీజీకి పీఎన్జీ, కిరోసిన్‌ను ప్రత్యామ్నాయంగా చూపే ప్రయత్నం చేస్తోంది. వాస్తవానికి గ్రామీణ ప్రాంతాలలోనూ గ్యాస్ వాడకం పెరిగింది. అక్కడ గ్యాస్ సరఫరా మరింత అస్తవ్యస్తంగా ఉంటుంది. కాగా, అందు బాటులో ఉన్న పైప్ గ్యాస్ విధానానికి మారా లని కేంద్ర ప్రభుత్వం వినియో గదారులకు సూచించింది. లేనిపక్షంలో ఎల్పీజీ సరఫరా నిలిపివేసే అవకాశం ఉన్నట్లు కూడా హెచ్చరించింది. దీనికోసం మూడు నెలలు గడువిచ్చింది. మార్చి 24న కేంద్ర పెట్రోలియం,సహజవాయువుల మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఎల్పీజీ నుంచి పీఎన్జీకి మార్పు ఐచ్ఛికం కాదని, తప్పనిసరని ఆ ఉత్తర్వులలో స్పష్టం చేసింది. తాజాగా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అన్ని రాష్ట్రాలకు కిరోసిన్ పంపిణీ చేయాలని చమురు మంత్రిత్వశాఖ ఆగమేఘాల మీద గెజిట్ నోటిఫికేషన్ సైతం విడుదల చేసింది. దీన్నిబట్టి దేశంలో గ్యాస్, ఇంధన కొరత ఉందన్న విషయాన్ని కేంద్రప్రభుత్వం పరోక్షంగా అంగీకరించినట్టే. తగిన మౌలిక సదుపాయాలు పట్టణాలలోనే అన్నిచోట్లా లేవు. ఆ ప్రాథమిక సదుపాయాలు ఉన్న ఫళాన కల్పించడం అసాధ్యమని ప్రభుత్వానికి తెలుసు. అయినా పీఎన్జీకి మారిపోండని చెప్పడం మోడీ ప్రభుత్వ బూటకాలలో మరొకటి మాత్రమే. పశ్చిమాసియా సంక్షోభం వల్ల నౌకాయానానికి ఇబ్బంది ఉండొచ్చునని ప్రభుత్వం ముందే ఊహించి తగిన ఏర్పాట్లు చేసి ఉంటే గొడవే ఉండేది కాదు. అసలు ప్రతిపక్షాలతో ఈవిషయం చర్చించనే లేదు. అదేమీ చేయకుండా జనం అనవసరపు ఆందోళన వల్ల అవసరం లేకపోయినా సిలిండర్లు తెప్పించుకుంటు న్నారంటూ నెపం జనం మీదకు నెట్టే ప్రయత్నం చేస్తుంది. సరైన విదేశాంగ విధానం, ఇంధన విధానం రూపొందిం చడంలో విఫలమైన ప్రభుత్వ వాదనల తీరు ఆడలేక మద్దెల ఓడు అన్నట్టుగా ఉంది. అంతా సవ్యంగానే ఉందని చెప్తున్న ప్రభుత్వం చీకటి బజారును, దొంగ నిలవలను ఎందుకు ఆపలేకపోతోందన్నదీ ఓ ప్రశ్నే. ప్రభుత్వం ఎల్పీజీ బదులు పీఎన్జీ వాడాలని చెప్తోంది. అయితే దానికి సిద్ధంగా ఉన్నామా? అది తక్షణ పరిష్కారం అవుతుందా? అన్న ఆలోచన ప్రభుత్వంలో కనిపించడం లేదు. పీఎన్జీ సరఫరా చేయడానికి అన్ని నగరాల్లో ఏ ఏర్పాటులేదు. పూర్తిగా పీఎన్జీ మీద ఆధారపడిన నగరాలు ఏపాటి గనక! పీఎన్జీకి మారడం వల్ల ప్రయోజనాలు, ధర కూడా తక్కువన్న మాట నిజమే. కానీ, మౌలిక సదుపాయాలు లేవన్నది అంతకంటే నిజం. పీఎన్జీ మరింత సురక్షితమైనదని చెబుతున్న కేంద్ర ప్రభుత్వానికి దానికి తగిన వ్యవస్థ లేదన్నది తెలియదా? ఆ సదుపాయాలు సమకూర్చకుండా లేడికి లేచిందే పరుగు అన్నట్టు పీఎన్జీకి మారి పోండని ఉచిత సలహా ఇవ్వడమంటే మరో బూటకాన్ని ప్రచారంలో పెట్టడమే. ఇది కుదిరే వ్యవ హారం కాదని ఇట్టే అర్థమవుతోంది. పీఎన్జీ వ్యవస్థ ఏర్పాటు చేయడానికి ఒక్కో ఇంటికి ఐదు నుంచి తొమ్మిది వేల రూపాయల ఖర్చవుతుంది. అంత ఖర్చు ఒకే విడతలో భరించడం ఎన్ని కుటుంబాలకు సాధ్యం? దేశంలో చమురు కొరత లేదని కేంద్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా.. సరఫరాపై ఆంక్షలు పెడుతోంది. గతంలో ఇరవై రోజులకు ఉన్న గ్యాస్‌బుకింగ్ ఇప్పుడు మరో ఐదు రోజులకు పెంచింది. అప్పుడు మాత్రమే వినియోగదారులు గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని ఆదేశించింది. హోటళ్లు, పారిశ్రామిక అవసరాలకు సరఫరా నిలవడంతో ఇప్పటికే కొన్ని హోటళ్లు, మెస్‌లు, రెస్టారెంట్లు మూసివేశారు. హాస్టళ్లు, మెస్‌లపై ఆధారపడిన విద్యార్థులు, చిరుద్యోగులు అవస్తలు పడుతున్నారు. నిరంతరం ధరల పెరుగుదల, క్షీణిస్తున్న వాస్తవ ఆదాయాలతో కుంగిపోతున్న మధ్య తరగతి, శ్రామికులకు ఈ పరిణామాలు శరాఘాతం. తన ప్రజావ్యతిరేక విధానాలను కట్టిపెట్టి పెంచిన ధరలను కేంద్రం తగ్గించాలి. వంటగ్యాస్‌పై పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని వదులుకోవాలి. ఆ మేరకు ప్రజల భారం తగ్గిం చాలి. అమెరికా సామ్రాజ్యవాద విధానాల ముందు లొంగిపోయిన మోడీ ప్రభుత్వం... పశ్చిమాసియా వివాదమే గ్యాస్ కొరతకు, ధరల పెంపునకు కారణమని సమర్థించుకోవడం దాని స్వయంకృత అపరాధాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నమే. యూఎస్-ఇజ్రాయిల్ యుద్ధోన్మాద విధానాలను ప్రతిఘటించాలి. పెట్రోలు, వంట గ్యాస్ కొరతను నివారించడంతో పాటు ధరల పెంపును తక్షణమే ఉపసంహరిం చుకోవాలి. ఇప్పటికైనా కాలయాపన చేయకుండా సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్రానిదే.

## మహిళలకు శుభవార్త చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం

హైద్రాబాద్: తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని దృష్టిలో పెట్టుకుని ఆంధ్రప్రదేశ్‌లో కూడా టీడీపీ, జనసేన, బీజేపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కూడా సక్సెస్‌ఫుల్‌గా అమలు చేస్తోంది. ఈ క్రమంలోనే తెలంగాణ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకంలో సరికొత్త రికార్డు నమోదైంది. ఈ మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళల ఉచిత బస్సు ప్రయాణ ఛార్జీల మొత్తం ఇవాల్టితో రూ.10 వేల కోట్ల మార్కును చేరుకున్నట్లు అధికారులు వెల్లడించడం గమనార్హం. ఇక ఈ విషయాన్ని టీజీఎస్‌ఆర్టీసీ అధికారులు అధికా రికంగా ప్రకటించారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన రెండు రోజులకే అంటే.. 2023 డిసెంబర్ 9వ తేదీన ఈ ఉచిత బస్సు పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ పథకం.. ప్రస్తుతి 290 కోట్లకు పైగా జీరో టికెట్లను మహిళలకు జారీ చేశారని.. ఈ పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.10,000 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. మరోవైపు.. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని ఆర్టీసీ వర్గాలు వెల్లడించాయి. గతంలో మహిళల ప్రయాణాలు 40 శాతంగా ఉండగా.. ఇప్పుడు అది 67 శాతానికిపైగా పెరిగినట్లు చెప్పాయి. నిత్యం సగటున 35 లక్షల మందికిపైగా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారని గణాంకాలతో సహా వివరించారు. ఉద్యోగ, ఉపాధి, విద్య అవకాశాల కోసం రాష్ట్రంలోని మహిళలు ఈ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు. మరోవైపు.. గ్రామాల నుంచి నాణ్యమైన వైద్యం కోసం మహిళలలు ఆస్పత్రుల కోసం హైదరాబాద్ నగరానికి కూడా వస్తుండటం గమనార్హం. మరోవైపు.. కుటుంబ సభ్యులతో కలిసి రాష్ట్రంలో ఉన్న పుణ్యక్షేత్రాలకు కూడా వెళ్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రతీసారి మహిళలు బస్సుల్లో ప్రయాణించేటపుడు ఉచిత ప్రయాణం కోసం.. ఆధార్ కార్డును పట్టుకుపోవడం అలవాటుగా మారింది. అయితే మహిళలకు మరింత సౌకర్యంగా ఉండేందుకు మహాలక్ష్మి పథకం కోసం త్వరలోనే చిప్ ఆధారిత స్మార్ట్ కార్డులను జారీ చేయనున్నట్లు తాజాగా టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి స్పష్టం చేశారు. చిప్ ఆధారిత స్మార్ట్ కార్డులు అందుబాటులోకి వచ్చిన తర్వాత మహిళలు.. ఆధార్ కార్డు చూపించాల్సిన అవసరం లేకుండా.. కేవలం స్మార్ట్ కార్డులు చూపించి ఉచితంగా బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని చెబుతున్నారు. బస్సుల్లో పెరిగిన మహిళల రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను ప్రవేశపెడుతున్నట్లు ఎండీ నాగిరెడ్డి స్పష్టం చేశారు. ఇక జీరో టికెట్లను ఆర్టీసీ మహిళలకు జారీ చేస్తుండగా.. వాటికి సంబంధించిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ రూపంలో టీజీఎస్‌ఆర్టీసీకి చెల్లిస్తోంది. ఇలా చేయడం వల్ల కూడా ఆర్టీసీకి ఆదాయం పెరుగుతుంది.

## ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక సెల్: కార్మికశాఖ మంత్రి వివేక్

హైద్రాబాద్: తెలంగాణ ప్లాట్‌ఫాం ఆధారిత గిగ్ వర్కర్ల (రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత మరియు సంక్షేమం) బిల్లు-2026ను శాసనసభ ఆమోదించింది. అసెంబ్లీలో ఈ బిల్లును కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖల మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా బిల్లులోని ముఖ్యాంశాలను వివరించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్‌ఠాకూర్, సంజీవరెడ్డి, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంఐఎం సభ్యులు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, బీజేపీ సభ్యులు పాల్వాయి హరీశ్, సీపీఐ శాసనస భాపక్షనేత కూనంనేని సాంబ శివరావు తదితరులు దీనిపై మాట్లాడారు. కొందరు సభ్యులు బిల్లులోని అంశాల్లో మరిన్ని వివరాలను కోరారు. మరికొందరు సభ్యులు ఈ బిల్లు ఆవశ్య కతను వివరిస్తూ, స్వాగతించారు. కూనంనేని సాంబ శివరావు మాట్లాడుతూ గిగ్ వర్కర్లతో పాటు అసంఘటితరంగంలో ఉన్న దాదాపు 2 కోట్ల మంది కార్మికులం దర్నీ పీఎఫ్, ఈఎస్ఐ పరిధిలోకి తెచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యోగి, యజమాని, ప్రభుత్వ భాగస్వామ్యాలతో రిటైర్‌మెంట్ తర్వాత వారికి పెన్షన్ సౌకర్యం కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. జర్నలిస్టుల జీవితాలు గిగ్ వర్కర్ల కంటే మెరుగ్గా ఏమాత్రం లేవన్నారు. కనీస వేతనాలు ఇవ్వట్లేదని చెప్పారు. అనంతరం



మంత్రి వివేక్ వెంకటస్వామి సభ్యులు లేవనెత్తిన సందేహాలకు సమాధానాలు చెప్పారు. బిల్లులోని ప్రధానాంశాలను వివరించారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో గిగ్ పర్కర్లకు చట్టబద్ధ గుర్తింపు ఇవ్వడమే లక్ష్యంగా ఈ బిల్లును తీసుకొచ్చామన్నారు. వర్కర్ల హక్కులు, గౌరవం, జీవనోపాదిని కాపాడే విధంగా నిబంధనలు రూపొందించామనీ, ఈ బిల్లు అమల్లోకి వచ్చాక ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం సంస్థలు క్రమం తప్పకుండా వివరాలు సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఎలక్ట్రానిక్ రిటర్న్స్ ఇవ్వాలనీ, నిబంధనలు పాటించకపోతే మొదటి తప్పిదానికి రూ.50 వేలు, రెండోసారి రూ.1 లక్ష, మూడోసారి రూ.1.5 లక్షలు, ఆ తర్వాత బకాయిలపై ఐదు రెట్ల వరకు జరిమానా విధించేలా చట్టంలో పొందు పర్చామన్నారు. గిగ్ వర్కర్ల కోసం 20 మందితో ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ప్రతి వర్కర్‌కీ యూనిక్ ఐడీ ఇస్తామనీ, 1 నుంచి 2 శాతం లెవీతో వెల్ఫేర్ ఫండ్ సిద్ధం చేసి, ఇన్సూరెన్స్, పెన్షన్, ప్రసూతి ప్రయోజనాలు కల్పిస్తామన్నారు. ప్రతి లావాదేవీపై ఫీజు వసూలు చేసి, బోర్డు నిర్వహణ ఖర్చులకు గరిష్టంగా 5శాతం విని యోగిస్తామని వివరణ ఇచ్చారు. గిగ్ వర్కర్లకు ప్రత్యేక శిక్షణ, తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలు, ట్రాఫిక్ పోలీసులతో ఉన్న ఇబ్బందులు తదితర అంశాలను ఈ సందర్భంగా మంత్రి ప్రస్తావించారు. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం శాసనసభ ఈ బిల్లును ఆమోదించినట్టు స్పీకర్ ప్రకటించారు.

## కేడీసీ వృక్షశాస్త్ర విభాగానికి యూకే డిజైన్

వరంగల్: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ (స్వయంప్రతిపత్తి) వృక్షశాస్త్ర విభాగ అధ్యాపకుడు రూపొందించిన 'ప్లాంట్ టిష్యూ కల్చర్ ప్రాసెసింగ్ పరికరం' నమూనాకు యునైటెడ్ కింగ్‌డమ్ నుంచి డిజైన్ రిజిస్ట్రేషన్ లభించింది. ఈ డిజైన్ రిజిస్ట్రేషన్ నెంబర్ 6507219 కాగా 16 ఫిబ్రవరి 2026న రిజిస్ట్రేషన్, 13 మార్చి 2026న గ్రాంట్ మంజూరైంది. ఈ పరిశోధనలో ప్రధాన పరిశోధకుడిగా డాక్టర్ తిరునహరి యుగంధర్ పనిచేశారు. ఈ పరికరం ప్లాంట్ టిష్యూ కల్చర్ ప్రయోగశాలలలో ఉపయోగించేవిధంగా రూపొందించబడింది. ఇందులో పై భాగంలో డిస్‌ప్లే వ్యవస్థ, మధ్యలో పారదర్శక టిష్యూ కల్చర్ ప్రాసెసింగ్ ఛాంబర్, కింది భాగంలో కల్చరల్ ట్యూబ్స్ కోసం ప్రత్యేక విభాగాలు, గాలి ప్రసరణ కోసం వెంటిలేషన్ సదుపాయాలు ఉన్నాయి. ఈ పరికరం ద్వారా అరటి, చెరకు, బంగాళాదుంప, ఆర్కిడ్స్, ఔషధ మొక్కల టిష్యూ కల్చర్ ప్రక్రియను సులభంగా, సమగ్రంగా నిర్వహించవచ్చని పరిశోధకుడు డాక్టర్ తిరునహరి యుగంధర్ తెలిపారు. ఈ డిజైన్ రిజిస్ట్రేషన్ పొందిన బృంద సభ్యుల్లో తిరునహరి యుగంధర్ (ప్రధాన పరిశోధకుడు), ఎలూరి కోమల, సూరా శ్యామ్‌ప్రసాద్, దాసరి సమ్మయ్య, మేడిశెట్టి నరేందర్, ఘన్‌సింగ్ మలోతు, గాంధీ నేమలి, మార్దా రాంబాబు, గోగికార్ భగీరథ్, ధరావత్ పార్వతి, సహాయ పరిశోధకులుగా పనిచేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, రాజశేఖర్, ఇతర అధ్యాపకులు బృంద సభ్యులను అభినందించారు.

## టెక్కీల సంపాదన కన్నా ఆటో డ్రైవర్ల సంపాదనే ఎక్కువ..

హైద్రాబాద్: టెక్కీల సంపాదన కన్నా ఆటో డ్రైవర్ల సంపాదనే ఎక్కువ.. ఉత్కర్ష్ సర్వేలో ఆసక్తి కర విషయాలు.. ఒకప్పుడు కేవలం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం లేదా కార్పొరేట్ కొలువు ఉంటేనే సమాజంలో గౌరవం, భారీ సంపాదన అనుకునేవాళ్లం. కానీ, ముంబై లాంటి మహానగరాల్లో ఒక ఆటో డ్రైవర్ సంపాదన ఇప్పుడు బీటెక్ పూర్తి చేసిన ఫ్రెషర్స్ కంటే రెండింతలు ఎక్కువగా ఉండడం వింటుంటే మనకు తెలియని ఒక కొత్త 'ఆర్థిక వాస్తవం' బయటపడుతోంది. మాజీ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ ఉత్కర్ష్ వర్మ సోషల్ మీడియాలో పంచుకున్న వివరాలు నెట్టింట సంచలనం సృష్టిస్తున్నాయి. వైట్ కాలర్ ఉద్యోగాల గ్లామర్ వెనుక ఉన్న తక్కువ జీతాలు, బ్లూకాలర్ వృత్తుల్లో ఉన్న భారీ ఆదాయ మార్గాలపై లోతుగా విశ్లేషిస్తే.. టెక్కీల కంటే ట్రిప్పులే మిన్నఉత్కర్ష్ వర్మ ఒక ఆటో డ్రైవర్‌తో జరిపిన సంభాషణ ప్రకారం.. ముంబైలో ఆటో నడపడం అనేది ఇప్పుడు అత్యంత లాభదాయకమైన వృత్తిగా మారినట్లు డ్రైవర్ చెప్పారు. అన్ని ఖర్చులు పోను ఒక డ్రైవర్ రోజుకు సగటున రూ. 2,500 సంపాదిస్తున్నారు. కష్టపడి పనిచేసే డ్రైవర్ నెలకు రూ. 75,000 వరకు ఇంటికి తీసుకెళ్లగలడు. కొంతమంది చురుకైన డ్రైవర్లు నెలకు ఏకంగా రూ. లక్ష మార్కును కూడా అందుకుంటుండగా, కనీస సంపాదన రూ. 60,000 తక్కువ కాకుండా ఉంటోందని ఆయన చెప్పారు. గ్రాడ్యుయేట్స్ జం ఆటో డ్రైవర్స్! ముంబైలో ఒక ఫ్రెషర్ (తాజా గ్రాడ్యుయేట్) సగటు ప్రారంభ జీతం సుమారు రూ. 30,000 మాత్రమే ఉంటుంది. అంటే ఒక ఇంజినీర్ సంపాదన కంటే ఆటో డ్రైవర్ సంపాదన రెట్టింపు కంటే ఎక్కువగా ఉంది. వర్మ తన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ, తాను బీటెక్ పూర్తి చేశాక చేసిన మొదటి ఉద్యోగం జీతం.. నేటి ఆటో డ్రైవర్ల సంపాదన కంటే తక్కువేనని ఒప్పుకోవడం గమనార్హం. ఇది చదువుకున్న వారికి దక్కుతున్న జీతాలపై ఆందోళన కలిగిస్తోంది. నెట్‌వర్కింగ్ లో కింగ్! ఆటో డ్రైవింగ్ అనేది కేవలం డ్రైవింగ్‌కే పరిమితం అంటే పొరబాటే.. అది ఒక సామాజిక అనుభవం అని వర్మ విశ్లేషించారు. క్యూబికల్స్ (ఆఫీస్ గదుల) లో బందీ అయి ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కంటే, ఆటో డ్రైవర్లు ప్రతిరోజూ వందలాది మంది కొత్త వ్యక్తులను కలుస్తారు. ఇది వారికి గొప్ప నెట్‌వర్కింగ్ అవకాశాలను కల్పిస్తుం ది. బాస్ కి సమాధానం చెప్పాల్సిన అవసరం లేకుండా, తమకు నచ్చిన సమయంలో పని చేసుకునే స్వేచ్ఛ వారికి ఉంటుంది. నాణేనికి మరోవైపుఅయితే, ఈ భారీ ఆదాయం వెనుక ఉన్న కష్టాన్ని కూడా మనం విస్మరించడానికి లేదు. ముంబైలోని ఎండ, వర్షం, ట్రాఫిక్ మధ్య గంటల తరబడి ఆటోలో కూర్చోవడం ఆరోగ్యానికి పెను సవాల్ గా మారే అవకాశం ఉంది. ఏసీ ఆఫీసుల్లో ఉండే సౌకర్యం ఇక్కడ ఉండదు. కార్పొరేట్ ఉద్యోగాల్లో ఉండే హెల్త్ ఇన్సూరెన్స్, పీఎఫ్, గ్రాట్యుటీ వంటి ప్రయోజనాలు ఆటో డ్రైవర్లకు ఉండవు. రేపు పనిలోకి వెళ్లలేకపోతే ఆ రోజు సంపాదన సున్నా అనే అనిశ్చితి వెంటాడుతూనే ఉంటుంది.

# కనీస ఆదాయం ఉండేలా చూడాలి: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



హైదరాబాద్, : శాసనమండలిలో ప్రవేశ పెట్టిన బిల్లులపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్పంది స్తూ, ప్రజా పక్షాన నిలబడి ప్రభుత్వా నికి అనేక విలువైన సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులను స్వాగతిస్తూనే, వాటిలోని లోపాలను మెరుగుపరచాల్సిన అంశాలను ఆయన ఎత్తిచూపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లును స్వాగతిం చారు. రా జ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం అందరూ సమానమేనని గుర్తు చేస్తూ, కేవలం అడ్వకేట్లకే కాకుండా జర్నలి స్టులు, ఉపాధ్యాయులు, ఆర్టీ సీ సిబ్బంది, రెవెన్యూ, ఎలక్ట్రిసిటీ ఉద్యోగులకు కూడా ఇటువంటి రక్షణ కల్పించాలని కోరా రు. గిగ్ వర్కర్ల కోసం తెచ్చిన బిల్లు కేవలం 'సంక్షేమం' చుట్టూ తిరుగుతోందని, అది వారి 'హక్కుగా' ఉండాలని మల్లన్న డిమాండ్ చేశా రు. ప్రతి గిగ్ వర్కర్కు ఒక నిర్ణీత కనీస ఆదా యం ఉండేలా చూడాలని సూచించారు. వెల్ఫే ర్ బోర్డులో అధికారుల కంటే గిగ్ వర్కర్లకే 51% ప్రాతినిధ్యం ఉండాలని, అప్పుడే వారి గొంతు బలంగా వినిపిస్తుందని స్పష్టం చేశారు. యాప్ అకౌంట్లు అన్యాయంగా బ్లాక్ అ యితే కార్మికుడు అప్పీల్ చేసుకునే అవకాశం ఉండాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ తల్లిదండ్రులను పోషిం చాలనే బిల్లును ఆయన 'చారిత్రా త్మకమైనది'గా అభివర్ణించారు. ఓటు నమోదు చేసుకున్న వారు వరుసగా మూడు సార్లు ఓటు వేయకపోతే, వారి ఓటును తొలగించే దిశగా చట్టపరమైన చర్యలు తీసుకోవాల ని ప్రతిపాదించారు. రాష్ట్రం లో 50 వేల కు టుంబాలు ఆధారపడి ఉన్న అవుట్ డోర్ మీడి యా రంగాన్ని కేవలం ఇద్దరు ముగ్గురు వ్యక్తు ల చేతుల్లోకి వెళ్లకుండా చూడాలని కోరారు. జీవో నెం బర్ 69 ని సవరించి, చిన్న చిన్న అడ్వర్టైజింగ్ ఏజెన్సీలను రక్షించాలని, ఈ రంగాన్ని ఒక స్కామ్ లా కాకుండా ఉ పాధిగా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్తు రద్దు చేయడాన్ని మద్దతు తెలుపుతూ, వైద్య శాఖలోని అవుట్ సోర్సింగ్ మరియు కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు. శాసనమండలిలో వివిధ వర్గాల ప్రజల గొంతుకగా నిలిచి, సమగ్రమైన చర్చలు జరిపిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గారి ప్రసం గాలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మంత్రి శ్రీధర్‌బాబు ఫిదాఓటు హక్కు వినియోగంపై జరిగిన చర్చ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న లేవనెత్తిన అంశానికి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు స్పందించారు. ఓటు నమోదు చేసుకొని కూ డా ఎన్నికల సమయంలో ఓటు వేయని వారి పై మల్లన్న గారు వ్యక్తం చేసిన అభిప్రాయాలు సముచితంగా ఉన్నాయని మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు కీలక మని, ఓటు హక్కు వినియోగం ప్రతి పౌరుడి బాధ్యతగా భావించాల్సిన అవసరం ఉ oదని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై మల్లన్న చేసిన సూచనలు గమనార్హమని.

# ఏప్రిల్ 2న గ్రామసభ నిర్వహించాలి- కలెక్టర్



ఖమ్మం : పండుగ వాతావరణంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమ గ్రామసభ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం గ్రామసభ నిర్వహణపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2న ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహించాలని అన్నారు. గ్రామసభ నిర్వహణలో అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని అన్నారు. మండల స్థాయి అధికారులను వివిధ గ్రామ పంచాయతీల్లో నిర్వహించే గ్రామసభలలో పాల్గొనేలా ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. మండల ప్రత్యేక అధికారులు కూడా గ్రామసభ కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ తెలిపారు. ప్రజా ప్రతినిధులందరు గ్రామ సభల్లో పాల్గొనే విధంగా ఆహ్వాన పత్రికలు అందించాలని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రతి గ్రామ పంచాయతీకి గత 2.5 సంవత్సరాల కాలంలో అందించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన ప్రింటెడ్ మెటీరియల్ అందించాలని కలెక్టర్ తెలిపారు. అభయహస్తం గ్యారంటీ పథకాలు, సన్న బియ్యం సరఫరా వంటి అనేక పథకాలకు సంబంధించిన వివ రాలు గ్రామ సభలో ప్రజల ముందు వినిపిం చాలని అన్నారు. పండుగ వాతా వరణ ంలో గ్రామ సభలు జరగాలని, దానికి అనుగుణంగా ఎల్.ఈ.డి. స్క్రీన్, సౌండ్ సిస్టం, స్టేజీ డెకరేషన్ ఉండాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర గీతంతో గ్రామ సభ ప్రారంభం అవుతుందని, అనంతరం సీఎం సందేశం, వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాల వివరాలు తెలియజేయడం, వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేయడం, లబ్ధిదారుల అభిప్రాయాలు తీసుకోవడం, ప్రజా ప్రతినిధుల సందేశంతో కార్యక్రమం ఉండాలని తెలిపారు. ఈ నిధులు వినియోగిస్తూ గ్రామసభ కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలని, పంచాయతీ అధికారి ప్రత్యేకంగా గ్రామ సభల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.పద్మశ్రీ, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల జయంతి ఉత్సవాలు..




భువనగిరి, మహనీయుల జయంతి ఉ త్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా సన్నాహక సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ సంఘాల నాయకుల ద్వారా వారి తెలియజేసిన సలహాలు, సూచనలను స్వీకరించారు. ఈ సమావేశానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఏప్రిల్ మాసంలో మహనీయుల జయంతి ఉత్సవాలను ఒక పండుగ వాతావరణంలో జిల్లాలో ఏప్రిల్ 5 న బాబు జగ్ జీవన్ రామ్ జయంతి ,ఏప్రిల్ -11న జ్యోతిబా పూలే , మరియు ఏప్రిల్ -14 డా,,బి. ఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పెద్ద ఎత్తున వివిధ శాఖల సహకారంతో అనేక కార్యక్రమాలు నిర్వహించేందుకు అందరి సహకారంతో సామరస్యంగా ఉత్సవాలు నిర్వహించాలన్నారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే మహనీయుల జయంతి ఉత్సవాలకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ తెలిపారు. అవసరమైన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు, పారిశుధ్య చర్యలు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కుల బేధం లేకుండా అన్ని కులాల నాయకులు ఈ ఉత్సవాల్లో పాల్గొని విజయంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి సాహితీ, భువనగిరి డీఎస్పీ రవీందర్, ట్రాఫిక్ డీఎస్పీ ప్రభాకర్ రెడ్డి, ఈ.డి ఎస్సీ కార్పొరేషన్ శ్యాం సుందర్, వివిధ సంఘాల నాయకులు , ఎస్సీ సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# 'ద్రోణ' బికినీ రచ్చపై స్పందించిన ప్రియమణి







ఇప్పుడు పూర్తిగా ఫ్యామిలీ ఓరియెంటెడ్ రోల్స్ చేస్తోంది ప్రియమణి. కెరీర్ ఆరంభంలోనూ ఆమె సంప్రదాయ పాత్రలే చేసింది. అలాంటి అమ్మాయి.. మధ్యలో గ్లామర్ రోల్స్‌లో మామూలుగా రెచ్చిపోలేదు. ముఖ్యంగా నితిన్ హీరోగా తెరకెక్కిన 'ద్రోణ' అనే చిత్రంలో చేసిన బికినీ షో అప్పట్లో ఒక సంచలనం. అప్పటిదాకా ప్రియమణికి ఉన్న ఇమేజ్ వేరు. కానీ ఆ సినిమాలో బికినీలో వీర లెవెల్లో ఎక్స్‌పోజింగ్ చేయడం చూసి కుర్రకారుకు మతులుపోయాయి. కొన్నేళ్ల పాటు ఇంటర్నెట్లో ఆ ఫొటోలు వైరల్ అయ్యాయి. ఇప్పటికీ అప్పుడప్పుడూ ప్రియమణి బికినీ ఫొటోలు సోషల్ మీడియాలో తిరుగుతుంటాయి. ప్రియమణి ఇలా బికినీ వేసినపుడు.. ఫ్యామిలీ హీరోయిన్‌గా గుర్తింపు ఉన్న అమ్మాయి ఇలా చేసిందేంటి అంటూ పెద్ద చర్చే జరిగింది. ఐతే దాని గురించి ఎప్పుడూ స్పందించని ప్రియమణి.. ఇప్పుడు ఒక ఇంటర్వ్యూలో ఆ టాపిక్ గురించి మాట్లాడింది. వరలక్ష్మి శరత్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఎస్.సరస్వతి' చిత్రంలో ప్రియమణి ఓ కీలక పాత్ర చేసింది. ఈ సందర్భంగా వరలక్ష్మితో కలిసి పాల్గొన్న ఒక ఇంటర్వ్యూలో 'ద్రోణ' బికినీ రచ్చ గురించి ప్రియమణి మాట్లాడుతూ..''నేను అప్పటిదాకా అలాంటి లుక్‌లో కనిపించలేదు. దర్శకుడు బికినీ వేసుకోమని.. ఒక బాలీవుడ్ మూవీలో కరీనా కపూర్ తరహాలో చూపిస్తానని అన్నాడు. అది డైరెక్టర్ ఛాయిస్. తన మాట నేను వినాలి. ఎప్పుడూ ఒకేలా ఎందుకు ఉండాలి.. ఒక నటిగా ఇది కూడా ట్రై చేయాలి కదా అనిపించింది. విదేశాలకు వెళ్తే.. బీచుల్లో, స్విమ్మింగ్‌పూల్స్‌లో అమ్మాయిలందరూ బికినీలు, స్విమ్ సూట్లలోనే కనిపిస్తారు. సినిమాలో కూడా స్విమ్మింగ్ పూల్ సీన్ అంటే చీరలో కనిపించలేం కదా. అందుకే ఆ డ్రెస్ వేసుకోవడానికి ఒప్పుకున్నా. అప్పుడు దాని మీద పెద్ద డిస్కషన్ జరిగింది. అప్పుడు దర్శకుడు ఆ డ్రెస్ వేసుకోమన్నపుడు ఎక్కువ ఆలోచించలేదు. కానీ ఇప్పుడున్న మైండ్ సెట్‌లో ఆ డ్రెస్ వేసుకోమంటే ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తానేమో" అని ప్రియమణి వెల్లడించింది. రాజమౌళి శిష్యుడైన కరుణ్ కుమార్ అనే దర్శకుడు రూపొందించిన 'ద్రోణ' పెద్ద డిజాస్టర్ అయినప్పటికీ.. ప్రియమణికి మాత్రం ఆ మూవీ మంచి పాపులారిటీనే తెచ్చిపెట్టింది.

# శ్రీవిష్ణు గేరు మార్చే టైమొచ్చింది



కింగ్ అఫ్ కంటెంట్ లేదా ఎంటర్ టైన్మెంట్ అని వినడానికి బాగానే ఉంది కానీ హీరో విష్ణు తన ఎంపికను విశ్లేషించుకోవాల్సిన టైం వచ్చింది. కేవలం వారం గ్యాప్ లో విష్ణు విన్యాసం, మృత్యుంజయ్ తో థియేటర్లలో అడుగు పెట్టాడు. రెండు వేర్వేరు సంబంధం లేని జానర్లు కాబట్టి ఇబ్బంది ఉండదని భావించి ఉండొచ్చు. కానీ బాక్సాఫీస్ ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం ఖచ్చితంగా ఆలోచించాల్సిన విషయమే. ఒకసారి ఆడియన్స్ లో నమ్మకం తెచ్చుకున్న హీరోగా సెటిలయ్యాక ఎలాంటి రిస్క్ ఉ ండదని అనుకోవడానికి లేదు. ఎందుకంటే అల్లరి నరేష్ ఒకప్పుడు యాభై వంద రోజుల బ్లాక్ బస్టర్లు ఇచ్చిన గ్యారెంటీ స్టార్. కానీ ఇప్పుడు అంతా రివర్స్. హారర్, సీరియస్, మెసేజ్, కామెడీ ఇలా ఏ జానర్ టచ్ చేసినా రిజల్ట్ మాత్రం తేడా కొడుతోంది. ఆ మధ్య 12ఏ రైల్వేకాలనీకి మినిమమ్ ఓపెనింగ్స్ కూడా రాలేదు. శ్రీవిష్ణు ఈ రిస్కులో పడకూడదనుకుంటే గేరు మార్చాల్సిందే. మాటలను మింగేయడాన్ని టైమింగ్ అనుకోవడం, సోషల్ మీడియా ట్రెండ్స్ తో కథలు రాసుకొస్తే ప్రతిసారి వర్కౌట్ అవుతాయని భావించడం తనను రిస్క్ లో పడేస్తున్నాయి. మృత్యుంజయ్ లో పాయింట్ బాగున్నప్పటికీ దానికి రాసుకున్న ట్రీట్ మెంట్ ని సీరియస్ గా అనాలిసిస్ చేసుకుని ఉంటే ఖచ్చితంగా బెటర్ మూవీ అయ్యేది. విష్ణు విన్యాసం కంటే మృత్యుంజయ్ కొంచెం బెటరనే టాక్ వచ్చినప్పటికీ బాక్సాఫీన్ వద్ద నిలబడేందుకు అది సరిపోయేలా లేదు. హైదరాబాద్ మల్టీప్లెక్సుల్లో ఆదివారం ఫుల్ అవుతున్న సంగతి పక్కనపెడితే చాలా బిసి సెంటర్లలో మొదటి రోజు ఆక్యుపెన్సీనే తక్కువగా నమోదైన వాస్తవాన్ని విస్మరించకూడదు. బ్యాడ్ సీజన్, క్రికెట్ మ్యాచ్ లాంటివి కేవలం ఊరట కోసం చెప్పుకునే కారణాలు. ఇక్కడ గేరు మార్చడమంటే అర్థం స్పీడ్ పెంచమని కాదు. ప్రయోగాలు చేస్తూనే ఇప్పటి ట్రెండ్ కు అనుగుణంగా తనకు సూటయ్యే కథల వైపు మొగ్గు చూపడం. సామజవరగమన, రాజరాజ చోర, బ్రోచేవారెవరురా లాంటివి ఎందుకు సక్సెస్ అయ్యాయో విశ్లేషించుకోవడం. ఇది ప్రాపర్ గా జరిగితే తిరిగి ట్రాక్ లోకి వచ్చేయొచ్చు. లేదంటే డేంజర్ జోన్ ప్రమాదం పొంచి ఉంది.

# అభివృద్ధి దిశగా ముందుకు సాగాలి: కలెక్టర్




సూర్యాపేట, : జిల్లా కేంద్రంలో సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. స్థానిక రవి మహాల్ ఫంక్షన్ హాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అధ్యక్షతన నిర్వహించిన పురపాలక సంఘం 2025-26 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్, 2026-27 ముసాయిదా బడ్జెట్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వార్డు స్థా యిలో ప్రజల సమస్యలను పరిష్కరిం చడంలో మున్సిపల్ పాలక మండలిదే కీలక బాధ్యత అన్నారు. నూతన పాలక మండలి తొలి సమావేశంలోనే రూ. 107.32 కోట్లతో బడ్జెట్ రూపొం దించడం అభినందనీయమని అన్నారు. ఈ బడ్జెట్ లక్ష్యాలకు అనుగుణంగా మున్సి పాలిటీ ఆదాయ వనరులను పెంపొం దించి పట్టణ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పట్టణంలో పరిశుభ్రత నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రోడ్లు, మురికి కాలువలు, కల్వర్టులు, తాగునీటి పైప్లైన్ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల న్నారు. మహిళల భద్రత, సంక్షేమ పథకాల అమలులో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. మున్సిపాలిటీకి రావలసిన ఇంటి పన్ను, నల్లా బిల్లులు, ఇతర బకాయిల వసూళ్లలో ప్రజలను చైతన్య పరచి సమయానికి చెల్లించేలా ప్రోత్సహిం చాలని అన్నారు. అక్ర మ భవన నిర్మాణా లను అరికట్టి, మున్సిపాలిటీకి ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకో వాలని సూచిం చారు. అదేవిధంగా మున్సిపాలిటీ ఆస్తులను పరిరక్షించడంపై దృష్టి సారించాలని, గతంలో జాతీయ, రాష్ట్ర స్థా యిలో సూర్యాపేట మున్సిపాలిటీ సాధిం చిన గుర్తింపును తిరిగి సాధిం చేందుకు కృషి చేయాకన్నారు. కార్యక్రమ ంలో మున్సిపల్ చైర్పర్సన్ శ్రీమతి మొరిశెట్టి నివేదిత లక్షాధి, వైస్ ఛైర్పర్సన్ యం. డి. షఫీ ఉల్లా, కమీషనర్ సి.ఎచ్. హన్మంతరెడ్డి, మున్సి పల్ పాలక మండలి సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

వరంగల్: ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వడ్డేపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం డాక్టర్ మాలిక ఆధ్వర్యంలో వడ్డేవల్లి హోమియో డిస్పెన్సరీ (చమాన్) ఆవరణంలో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరమును హనుమకొండ డిఎంహెచ్వో డాక్టర్ ఏ. అప్పయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానికంగా వైద్యాధికారులు, సిబ్బంది సేవలు రెగ్యులర్గ అందిస్తున్నప్పటికీ, ఆరుగురు స్పెషలిస్ట్ వైద్య నిపుణులు గైనకాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, చిల్డ్రన్, డెంటిస్ట్, సేవలందిస్తున్నారని, అందువలన ఈ శిబిరం ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉ oటుందన్నారు. మెరుగైన సేవల నిమిత్తం డాక్టర్లు రిఫర్ చేసిన వారి వివరములు, తమ వద్ద విడివిడిగా నమోదు చేసుకోవాలన్నారు. ఎన్సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్ శిబిరాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. ముందుగా ఉచిత వైద్య సేవలో పాల్గొన్న ప్రజలకు ఆరోగ్య శాఖ ద్వారా చేపడుతున్నటువంటి ఆరోగ్య కార్యక్రమాలు, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. శిబిరంలో 264 మందికి పరీక్షలు నిర్వహించారు. 11 మందికి టాప్ స్మెరూ టెస్టులు, 35 మందికి ల్యాబ్ టెస్టులు నిర్వహించారు. అనంతరం ఉ చితంగా మందులు పంపిణీ చేశారు.

# ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలి: కేటీఆర్

హైదరాబాద్, : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లు' పై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బిల్లును పౌర స్వేచ్ఛను హరించే ఒక 'క్రూరమైన ఆయుధం'గా కేటీఆర్ అభివర్ణించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం తన విమర్శకుల నోళ్లు మూయించేందుకే ఇటు వంటి నిరంకుశ చట్టాలను తీసుకువ స్తోందని కేటీఆర్ మండిపడ్డారు. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు వాటిల్లుతుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సామరస్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతే అయినప్పటికీ, ఈ బిల్లులోని నిబంధనలు అత్యంత అస్పష్టంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. 'అమలు యంత్రాంగం ఆధారాల కంటే అధికారుల వ్యక్తిగత అభిప్రాయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా ఈ బిల్లు రూపకల్పన జరిగింది. ఇది కచ్చితంగా దుర్వినియోగానికి దారితీస్తుంది' అని కేటీఆర్ పేర్కొన్నారు. బిల్లులో ఉపయోగించిన 'వ్యతిరేక భావాలు ప్రేరేపించడం','సామాజిక సమగ్రతను దెబ్బతీయడం' వంటి పదాలకు స్పష్టమైన న్యాయ పరిమితులు లేవని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకునేందుకే ఈ పదజాలాన్ని పొందుపరిచారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలను విమర్శిస్తే వాటిని 'ఫేక్ న్యూస్'గా ముద్రవేసి జైలుకు పంపే ప్రమాదం పొంచి ఉ oదన్నారు. ఆర్టికల్ 19(1) ప్రకారం రాజ్యాంగ ఉల్లంఘనే.. 'శ్రేయా సింఘల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. కేవలం ప్రత్యక్ష హింసకు ప్రేరేపించే మాటలపైనే నియంత్రణ ఉ oడాలని, విమర్శ లేదా వ్యంగ్యం శిక్షార్హం కాదని కోర్టు స్పష్టం చేసిందని ఆయన తెలిపారు. ఈ పరిమితిని మించి చట్టాలు చేయడం ఆర్టికల్ 19(1) ప్రకారం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని స్పష్టం చేశారు. ఏడు నుంచి పది సంవత్సరాల వరకు జైలు శిక్షలను ప్రతిపాదించడం ద్వారా ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించాలని ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'జర్నలిస్టులు, విద్యార్థులు, సామాన్యులు తమ అభిప్రాయాలను పంచుకోవాలంటేనే భయపడేలా ఈ శిక్షలు ఉన్నాయి. ఇప్పటికే దేశంలో హేట్ స్పీచ్‌పై తగినన్ని చట్టాలు ఉండగా, అదనంగా ఈ చట్టం తీసుకు రావడంలో ఆంతర్యం ఏమిటి..?'అని కేటీఆర్ ప్రశ్నించారు. వెంటనే ఈ బిల్లును పున: పరిశీలించాలని, ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ అణచివేత ధోరణిని వీడాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పనులు వేగంగా కొనసాగుతున్నాయి: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్, మంచి రోడ్లతోనే ఆర్థిక ప్రగతి ఉంటుందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే ఆయన ఆర్ అండ్ బీ పద్దుపై మాట్లాడారు. రోడ్లు అభివృద్ధి చెందితేనే గ్రామీణ ఆర్థికవృద్ధి మెరుగుపడుతుందని అన్నారు. రోడ్ల అభివృద్ధితో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హ్యామ్ మోడల్ కింద రాష్ట్రంలో 12 వేల కిలోమీటర్ల రోడ్లను రూ.13,006 కోట్లతో రోడ్ల అభివృద్ధికి టెండర్ల ప్రక్రియను నెల రోజుల్లో పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్‌పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే, హైదరాబాద్ -- విజయవాడ జాతీయ రహదారిని ఆరు లేన్ల పనులకు మే మొదటి వారంలో టెండర్ ప్రక్రియను ప్రారంభిస్తామని అన్నారు. రూ.7,600 కోట్లతో మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు 52 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ పనులు త్వరలో మొదలుపెడతామని చెప్పారు. దీనికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సూచనప్రాయంగా అంగీకరించారని వివరించారు. డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నామని అన్నారు. వచ్చే మూడేండ్లలో హ్యాంతో కలిపి రూ.70 వేల కోట్లతో రాష్ట్రంలో రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని చెప్పారు. రోడ్డు ప్రమాదాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 2025లో దేశవ్యాప్తంగా 4.5 లక్షల రోడ్డు ప్రమాదాల్లో 1.6 లక్షల మంది మరణించారని వివరించారు. రాష్ట్రంలో 22,441 ప్రమాదాల్లో 6,221 మంది ప్రాణాలు కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. రోజుకు సగటున 18 నుంచి 20 మంది మరణిస్తున్నారని చెప్పారు. ప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటుందని అన్నారు. బుల్లెట్ ట్రైన్ కారిడార్లు (చెన్నై, పూణే, బెంగుళూర్) వంటి నగరాలను కలుపుతూ హై స్పీడ్ బుల్లెట్ ట్రైన్ కారిడార్ ఏర్పాటు చేయబోతున్నట్టు వివరించారు. బుల్లెట్ ట్రైన్స్ కోసం సెంటర్ పాయింట్‌గా భారత్ ఫ్యూచర్ సిటీలో శంషాబాద్ దగ్గరలో 500 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించనున్నట్టు చెప్పారు. ఉస్మానియా ఆస్పత్రి, హైకోర్టు కొత్త భవనాల పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. రూ.ఎనిమిది వేల కోట్లతో హైదరాబాద్‌లో నాలుగు టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణం జరుగుతోందని వివరించారు. సనత్‌నగర్ టిమ్స్ జూన్ నాటికి పూర్తవుతుందని చెప్పారు.

# హర్మూజ్ జలసంధి వద్ద వెయిట్ చేస్తున్న నౌకలెన్ని?

న్యూఢిల్లీ:భారతదేశానికి రావాల్సిన నౌకలకు సంబంధించిన వివరాల్ని తాజాగా కేంద్రం సైతం వెల్లడించిన సంగతి తెలిసిందే. చూస్తుండగానే ఇరాన్ – ఇజ్రాయెల్, అమెరికా మధ్య సాగుతున్నయుద్ధం మొదలై నెల దాటింది. మూ డు వారాల్లో యుద్ధాన్ని ముగించేస్తామని అగ్రరాజ్యం అమెరికా గొప్పలు చెప్పినా.. వాస్తవం మాత్రం అందుకు భిన్నంగా ఉన్న సంగతి తెలిసిందే. ఇటీవల కాలంలో వివిధ దేశాల మధ్య యుద్ధం జరిగినా.. ప్రపంచ దేశాలు ప్రభావి తమైంది అంతంతే. ఎప్పుడైతే ఇరాన్ – ఇజ్రాయెల్, అమెరికా మధ్య యుద్ధం మొదలైందో అప్పుడు కానీ ప్రపంచానికి అసలు నొప్పి తెలియలేదు. చూస్తుండగానే యుద్ధం మొదలై నెల రోజులు పూర్తైన నేపథ్యంలో.. పరిస్థితులు మరింత ఇబ్బందికరంగా మారాయి.ఇదిలా ఉంటే.. హర్మూజ్ జలసంధి వద్ద భారత్ కు చెందిన (భారత జాతీయ పతాకం, విదేశీ జాతీయ పతాకం ఉన్నప్పటికి భారత్ కు రావాల్సిన చమురు, ఎరువు నౌకలు) మొత్తం నౌకలు 22 వరకు ఉన్నట్లుగా కేంద్రం సైతం వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇరాన్ అనుమతి కోసం వెయిట్ చేస్తున్న మొత్తం నౌకల్లో పందొమ్మిది నౌకలు ముడి చమురుకు సంబందించిన నౌకలు కావటం గమనార్హం. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ కు రావాల్సిన నౌకల లెక్క సరే.. మరి ప్రపంచ దేశాలకు చెందిన ఎన్ని నౌకలు అక్కడ నిలిచిపోయాయి? అందులో అత్యధికం ఏ వస్తువుల్ని తీసుకొస్తున్నాయన్న వివరాల్లోకి వెళితే.. ఆసక్తికర అంశాలు వెలుగు చూస్తాయి.తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ప్రస్తుతం హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ అనుమతి కోసం వెయిట్ చేస్తున్న నౌకలు అక్షరాల 2 వేల నుంచి 3 వేల మధ్యన ఉంటాయని చెబుతున్నారు.ఈ అంకె విన్నంతనే అవాక్కు కావటం ఖాయం. కానీ.. ఈ గణాంకాలన్ని వాస్తవానికి దగ్గరగా ఉన్నట్లు చెబుతున్నారు. హర్మూజ్ జలసంధింకి ఇరువైపులా అంటే.. పర్షియన్ గల్ఫ్.. గల్ఫ్ ఆఫ్ ఓమన్ వద్ద భారీ స్థాయిలో నౌకలు నిలిచిపోయిన పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. ఇక్కడ నిలిచిపోయిన నౌకల్లో అత్యధికం అమెరికా, ఇజ్రాయెల్ దేశాలకు చెందినవే అన్నది సమాచారం. వీటికి అనుమతులు ఇచ్చేందుకు ఇరాన్ ససేమిరా అని తేల్చేయటంతో.. అనుమతుల కోసం వెయిట్ చేయక తప్పదు.ఈ దేశాలకు చెందిన నౌకలు యూఏఈ.. ఒమన్ తీరాల్లో లంగర్ వేసినట్లుగా చెబుతున్నారు. అంతేకాదు.. తాజాగా జరుగుతున్న యుద్ధం కారణంగా మొత్తం ఆరు క్రూయిజ్ నౌకలు ఈ జలసంధి వద్ద నిలిచిపోయాయి. సుమారు 15 వేల మంది ప్రయాణికులు ఇక్కడ చిక్కుకుపోయినట్లుగా సమాచారం. కంటైనర్ నౌకలు దాదాపు 130కు పైనే ఉన్నట్లు చెబుతున్నారు.భారత్ కు చెందిన 22కు పైగా నౌకలు తీరం దాటేందుకు తగిన అనుమతుల కోసం వెయిట్ చేస్తుండగా.. చైనాకు చెందిన 40-50 నౌకలు కూడా అనుమతుల కోసం వెయిట్ చేస్తున్నారు. ఇవి కాక.. రష్యా, పాక్, ఇరాన్ కు చెందిన నౌకలు కొన్ని తగిన అనుమతుల కోసం నిరీక్షిస్తున్నాయి. సింపుల్ లెక్కల్లో చెప్పాలంటే సాధారణంగా రోజువారీగా చూస్తే.. హర్మూజ్ జలసంధి నుంచి 138 నౌ కలు దాటాల్సి ఉంది.తాజాగా జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో రోజుకు 4 నుంచి 6 నౌకలకు మాత్రమే అనుమతిని ఇస్తున్నాయి. దీంతో.. యుద్ధం ఇప్పటికిప్పుడు ముగిసినా.. ఇక్కడి రద్దీ మొత్తం క్లియర్ అయి.. సాధారణ పరిస్థితులు నెలకొనేం దుకు నెలల సమయం పట్టే వీలుందని చెబుతున్నారు. యుద్ధం కొనసా... గితే పరిస్థితులు మరింతగా దిగజారతాయి. అదే సమయంలో యుద్ధం ముగిసినా.. పరిస్థితుల్లో మార్పులు వెను వెంటనే వచ్చే అవకాశం తక్కువ. ఏం జరిగినా.. ఈ యుద్ధం తాలుకూ ఎఫెక్ట్ మాత్రం కొన్ని నెలల పాటు కొనసాగటం ఖాయమని మాత్రం చెప్పక తప్పదు.

# కాంగ్రెస్ సామాజిక న్యాయం కోసం పోరాటం చేస్తుంది- మంత్రి



హైదరాబాద్, న్యాయవాదుల రక్షణ కోసం అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లు తీసుకొచ్చినట్టు రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో న్యాయవాదులు గట్టు వామన్‌రావు దంపతులు హత్యకు గురయ్యారని చెప్పారు. పట్టపగలే వారిని హత్య చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ నేతల ప్రోద్బలంతోనే వారు హత్యకు గురైనట్టు విమర్శించారు .అప్పట్లో వామనరావు కుటుంబసభ్యులకు న్యాయం జరగలేదనీ, అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండటవే ఈ బిల్లు లక్ష్యమని అన్నారు. న్యాయవాదుల సంక్షేమం, రక్షణకు మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తున్నదని చెప్పారు. సామాజిక న్యాయానికి సర్కారు కట్టుబడి ఉందన్నారు. మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చేసి చూపిస్తున్నామన్నారు. పీపీలు, స్టాండింగ్ కౌన్సిళ్లు, ఇతర లీగల్ నియామకాల్లో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. ఈ విషయంలో కేంద్రం సామాజిక న్యాయం పాటించలేదని గుర్తు చేశారు. లెక్కలు తీస్తే అసలు విషయం బయటపడుతుందని చెప్పారు. ఈ వివక్షతలపై సభలోని బీజేపీ సభ్యులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 414 మంది పీపీలు ఉంటే, బీసీలు 126, ఎస్సీలు 59, ఎస్టీలు 25 మంది ఉన్నారని గుర్తు చేశారు. ఏపీపీల్లో ఓసీలు 24 మంది, బీసీలు 37 మంది, ఎస్సీ లు 16, ఎస్టీలు మూడు, మైనార్టీ వర్గం నుంచి ఒకరు పనిచేస్తున్నారని చెప్పారు. మహిళా న్యాయవాదుల కోసం ప్రత్యేకంగా బార్ అసోసియేషన్ హాళ్ల ఏర్పా టుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. న్యాయ నిర్మాణ్ ప్రాజెక్టు కింద వారికి కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తామన్నారు. అనంతరం చర్చలో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు వదిలిన వాళ్లలో న్యాయవాదులే ఉన్నారని చెప్పారు. మహిళా న్యాయవాదుల సంఖ్య పెరుగుతున్నదని, వాళ్ల విషయంలోనూ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అడ్వకేట్ల అకాడమీ ఏర్పాటు చేయాలని న్యాయవాదుల కోరికగా ఉందనీ, దానిని ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు. జూనియర్ అడ్వకేట్లకు స్టయిఫండ్‌ను రూ. 5000 నుంచి రూ. 15000 పెంచాలని కోరారు. ఈ చర్చలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, వీర్లపల్లి శంకర్, ఆదినారాయణ, మహ్మద్ మోబిన్, రామ్మోహన్‌రెడ్డి, పాయల్‌శంకర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ అడ్వకేట్ల రక్షణ బిల్లును సభలో ప్రవేశపెట్టడం శుభదినమని చెప్పారు. జడ్జీల నియామకాల్లో కేంద్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించడం లేదని విమర్శించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తెస్తే ఎవరు వద్దన్నారని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ సామాజిక న్యాయం కోసం పోరాటం చేస్తున్నదని గుర్తు చేశారు.

# పరిస్థితిని పారదర్శకంగా వివరించాలి- మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, : అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో గ్యాస్ ఆధారిత వాహనాలకు గ్యాస్ కొరత ఉన్నందున ప్రత్యామ్నాయంగా ప్రజా రవాణా సేవలను మ రింతగా విస్తరించేందుకు ఉండే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఎల్‌పీజీ గ్యాస్ కొరతతో ఆటోలతో సహా గ్యాస్ ఆధారిత వాహనాలు ఎదుర్కొంటున్న ఇక్కట్లపై మంత్రి పౌర సరఫరాల శాఖ అధికారులతో పాటు ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా చేస్తున్న ప్రధాన పంపిణీ దారులతో సచివాలయంలో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ ర వీంద్ర,హైదరాబాద్ కలెక్టర్ హరిచందన తో పాటు ఐఓసీఎల్, గోగ్యాస్, ఫ్రెంచ్ కీ చెందిన టోటల్ ఎనర్జీలతో పాటు సూపర్ గ్యాస్, ప్రమ్ గ్యాస్ తదితర సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేటు సంస్థలతో ఏర్పడిన కొరతను భర్తీ చేయడానికి గాను ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ముందుకు రావాలన్నారు. వాహనాలకు సరఫరా చేసే ఎల్‌పిజి గ్యాస్ సరఫ రాలో ఏర్పడ్డ సంక్షోభాన్ని నివారించేందుకు సరఫరాలను పెంచాలని కేంద్ర పెట్రోలియం, సహజ వాయు వు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి లేఖ రాయలని పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్రను మంత్రి ఆదేశించారు. అదే సమయం లో గ్యాస్ ఆధారిత ఆటో సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుత పరిస్థితిని పారదర్శకంగా వివరించాలని ఆయన సూచించారు.గ్యాస్ ఆధారిత ఆటోలతో పాటు ఆటోలకు రోజువారీగా 202 టన్నుల గ్యాస్ అవసరం ఉండగా అంతర్జాతీయ స్థాయిలో ఏర్పడ్డ సంక్షోభంతో రోజు వారీగా 147 మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉన్నదన్నారు. రోజూ వారి లోటు 55 టన్నులు ఉండగా ఆ కొరత మొత్తం ప్రైవేటు రంగంలో కనిపిస్తోందన్నారు. ఆటో ఎల్‌పిజి సరఫరాలో 75 శాతం వాటాను ప్రైవేటు సంస్థలు కలిగి ఉన్నాయని చెప్పారు.ఐఓసిఎల్ మాత్రమే తాను రోజు వారీగా సరఫరా చేస్తున్న 35 టన్నుల కోటాను 23 ఔట్ లెట్ల ద్వారా సరఫరా చేస్తుందన్నారు. సూపర్ గ్యాస్, గో గ్యాస్, టోటల్ ఎనర్జీ, ప్రయిమ్ గ్యాస్ వంటి సంస్థలు మార్కెట్‌లో ప్రధాన పంపిణీ దారులుగా ఉన్నారని, ఇందులో ప్రభుత్వ వాటా మొత్తం 25 నుండి 30 శాతం వరకే కలిగి ఉందని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో 116 ఔటర్ రింగ్ రోడ్డు లోపట, బయట 27 తో కలిపి మొత్తం 143 ఉండగా అందులో 23 ఔట్ లెట్లు పనిచేయడం లేదన్నారు. వాటిలో 17 నగరం నడిబొడ్డున ఉన్నాయన్నారు.అంతర్జాతీయ స్థాయిలో ఏర్పడ్డ యుద్ధ వాతావరణం ఇంధన వనరుల మీద కనిపిస్తుందని, ఎల్‌పిజి దిగుమతి చేసే నౌకలు రెండు నుంచి మూడు రోజులు ఆలస్యంగా వస్తుండటంతో ఈ సంక్షోభానికి ప్రధాన కారణమని ఆయన స్పష్టం చేశారు. ప్రైవేట్ సంస్థలు కృష్ణపట్నం, మహారాష్ట్ర లోని జైఘడ్, ముంబై లతో పాటు తమిళనాడు రాష్ట్రల టెర్మి నల్స్ నుంచి బల్క్ ఎల్.పి.జీ నీ సేకరిస్తున్నాయన్నారు. కొన్ని సంస్థలు ప్రత్యామ్నాయ అంతర్జాతీయ వనరులను పరిశీలిస్తున్నాయని అయితే ఖచ్చితమైన సమయం చెప్పలేమని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

# మారుతున్న ప్రపంచ భయాలు..



న్యూఢిల్లీ:గత ఏడాది కాలంగా ప్రపంచ వ్యాప్తంగా ఏ ఇద్దరు వ్యక్తులు కలిసినా చర్చ అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) చుట్టూనే తిరిగేది. చాట్ జీపీటీ రాకతో టెక్నాలజీ ప్రపంచంలో ఒక పెద్ద భూకంపమే సంభవించింది. "నా ఉద్యోగం ఉంటుందా?"... "కోడింగ్ నేర్చుకోవడం వృథానేనా?", "యంత్రాలు మనుషులను బానిసలుగా చేసుకుంటాయా?" ఇలాంటి ప్రశ్నలతో సామాన్యుడి నుండి మేధావుల వరకు అందరూ వణికిపోయారు. ఐటీ కంపెనీల షేర్లు పతనం కావడం.. పెద్ద ఎత్తున లేఆఫ్స్ ప్రకటించడంతో భవిష్యత్తు అంధకారంగా కనిపించింది. కానీ ఒక్కసారిగా సీన్ మారిపోయింది. ఇప్పుడు ప్రపంచం చూపు టెక్నాలజీ స్క్రీన్ల మీద నుండి యుద్ధ భూమి వైపు మళ్లింది.ఏఐ భయాన్ని కమ్మేసిన యుద్ధ మేఘాలునిన్నటి వరకు మన జీవనశైలిని ఏఐ మార్చేస్తుందని భయపడ్డాం. కానీ నేడు అసలు జీవించి ఉంటామా లేదా అన్నంతగా యుద్ధ మేఘాలు ప్రపంచాన్ని కమ్మేస్తున్నాయి. ముఖ్యంగా పశ్చిమాసియాలో ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచాన్ని మూడవ ప్రపంచ యుద్ధం అంచున నిలబెట్టాయి. డొనాల్డ్ ట్రంప్ హయాం నుండి మొదలైన ఈ రాజకీయ చదరంగం ఇప్పుడు క్షిపణులు, డ్రోన్ దాడుల స్థాయికి చేరుకుంది. నిన్నటి వరకు 'ప్రాంప్ట్ ఇంజనీరింగ్' నేర్చుకోవాలనుకున్న యువత.. నేడు అంతర్జాతీయ వార్తల్లో 'బాలిస్టిక్ మిస్సైల్స్' సామర్థ్యం గురించి చదువు తోంది. టెక్నాలజీ సృష్టించే నిరుద్యోగం కంటే యుద్ధం సృష్టించే మారణ హోమం భయంకరమైనదని ప్రపంచం గ్రహించింది.ఆర్థిక వ్యవస్థపై యుద్ధం కోలుకోలేని దెబ్బయుద్ధం కేవలం సరిహద్దులకు పరిమితం కాదు. అది ప్రతి ఒక్కరి వంటగదిపై ప్రభావం చూపుతుంది. సముద్ర మార్గాల్లో రవాణా నిలిచిపోవడం వల్ల నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకుతాయి. పశ్చిమాసియాలో అస్థిరత నెలకొంటే చమురు ధరలు పెరిగి, పేద మరియు అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వెన్నుముక విరుగుతుంది. యుద్ధ భయంతో ఇన్వెస్టర్లు వెనక్కి తగ్గడం వల్ల స్టాక్ మార్కెట్లు కుప్పకూలి, ఏఐ కంటే వేగంగా ఆర్థిక మాంద్యం వచ్చే ప్రమాదం ఉంది.చరిత్ర పునరావృ తమవుతోందిమానవ చరిత్రను గమనిస్తే భయం అనేది ఎప్పుడూ ఒకేలా ఉండదు. "ఒకప్పుడు ప్లేగు, కలరా వంటి మహమ్మారులు ప్రపంచాన్ని భయపెట్టాయి. ఆ తర్వాత ప్రపంచ యుద్ధాలు ప్రాణాలను బలితీసుకున్నాయి. ఇటీవలి కాలంలో కోవిడ్-19 రూపంలో కంటికి కనిపించని శత్రువుతో పోరాడాం. ఇప్పుడు ఏఐ ఆందోళనలను యుద్ధం భర్తీ చేసింది. సవాళ్లు రూపం మార్చుకుంటున్నాయి తప్ప మనిషి ఎదుర్కొనే పోరాటం మాత్రం ఆగడం లేదు. ఒక సంక్షోభం నుండి బయటపడ్డామని ఊపిరి పీల్చుకునే లోపే మరో విపత్తు పలకరిస్తోంది.ఆందోళన వద్దు.. ఆత్మవిశ్వాసమే ఆయుధంప్రస్తుత పరిస్థితుల్లో సామాన్యులు చేయాల్సింది భయంతో కుంగిపోవడం కాదు. అతిగా ఆందోళన చెం దడం వల్ల మానసిక స్థిరత్వం దెబ్బతిం టుంది. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయని భయపడినా, యుద్ధం వస్తుందని వణికిపోయినా పరిష్కారం దొరకదు. చరిత్ర మనకు నేర్పిన పాఠం ఏమిటంటే "ఎంతటి కటిక చీకటినైనా చీల్చుకుంటూ మనిషి ముందుకు సాగగలడు." సాంకేతి కతను అందిపుచ్చుకుంటూనే శాంతి కోసం ప్రపంచ దేశాలు ఏకం కావాల్సిన సమయం ఇది. భవిష్యత్తులో ఏఐ మళ్ళీ ప్రధాన చర్చాంశం కావచ్చు లేదా సరికొత్త విపత్తు రావచ్చు. కానీ, మానవ పోరాట స్ఫూర్తి ముందు ఏదీ శాశ్వతం కాదు. భయం కంటే ఆత్మవిశ్వాసమే మనల్ని ఈ సంక్షోభం నుండి గట్టెక్కిస్తుంది.

# మోసగించిన వ్యక్తి.. గుర్తించి అరెస్ట్

ముంబై: ఒక హైకోర్టు న్యాయమూర్తి, సైబర్ నేరగాడి ట్రాప్‌లో పడ్డారు. ఆ జడ్జికి ఒక లింక్ పంపిన అతడు రూ.6 లక్షల మేర ఆయనను మోసగించాడు. న్యాయమూర్తి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. చివరకు నిందితుడ్ని గుర్తించి అరెస్ట్ చేశారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. ఫిబ్రవరి 28న బాంబే హైకోర్టు న్యాయమూర్తి తన క్రెడిట్ కార్డ్ పాయింట్లను రీడీమ్ చేసుకునేందుకు ప్రయత్నించారు. ఆ బ్యాంకు కస్టమర్ కేర్ నంబర్‌ను సంప్రదించడానికి ప్రయత్నించగా బిజీ వల్ల లైన్ కలవలేదు.కాగా, ఆ న్యాయమూర్తి బ్యాంక్ కస్టమర్ కేర్ నంబర్ కోసం ఇంటర్నెట్‌లో వెతికారు. ఒక నకిలీ నంబర్‌కు ఆయన కాల్ చేశారు. జడ్జితో మాట్లాడిన సైబర్ మోసగాడు కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్‌గా నమ్మించాడు. ఆయనకు ఒక లింక్‌ను పంపి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించాడు.మరోవైపు ఆ న్యాయమూర్తి తన ఐఫోన్‌లో ఆ యాప్ డౌన్‌లోడ్ చేసేందుకు ప్రయత్నించారు. సాధ్యం కాకపోవడంతో ఆండ్రాయిడ్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆ నకిలీ టెలికాలర్ సూచించాడు. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి తన సిమ్ కార్డును ఇంటి పనిమనిషి ఆండ్రాయిడ్ ఫోన్‌లో వేసి ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఆ యాప్‌లో తన క్రెడిట్ కార్డు వివరాలను నమోదు చేసిన వెంటనే ఆయన ఖాతా నుంచి రూ. 6.02 లక్షలు విత్ డ్రా అయ్యాయి.కాగా, మోసపోయినట్లు గ్రహించిన ఆ బాంబే హైకోర్టు జడ్జి వెంటనే ముంబై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కఫ్ పరేడ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. జార్ఖండ్‌లోని జామ్తారాలో నివసించే 25 ఏళ్ల మజార్ ఆలం ఇస్రాయిల్ మియాన్‌ను నిందితుడిగా పోలీసులు గుర్తించారు. జార్ఖండ్‌లోని జామ్తారా సైబర్ సెల్, కర్మతాండ్ పోలీసుల సహాయంతో పది రోజుల్లోనే నిందితుడ్ని అరెస్ట్ చేశారు. 10 రాష్ట్రాల్లో జరిగిన 36 సైబర్ మోసాల కేసులతో నిందితుడికి సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తెలిసిందని పోలీస్ అధికారి తెలిపారు.

## హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చండూరు, : హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను బాలికలు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న హెచ్ పి వీ వ్యాక్సిన్ కేంద్రాన్ని చండూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఈ వ్యాక్సిన్‌కు వేల రూపాయలు ఖర్చవుతుండగా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో దీనిని పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. కావునా అర్హులైన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.చండూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మాసరాజు మాట్లాడుతూ.. 14 నుండి 15 ఏళ్ల వయస్సు గల బాలికలకు వారి తల్లిదండ్రుల సమక్షంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయనున్నట్లు వివరించారు. అర్హులైన బాలికలు తమ ఆధార్ కార్డు ఫోటో కాపీని సమర్పించి, అన్ని పని దినాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీకా తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంధ్యా బ్లెస్సి, సూపర్‌వైజర్ ఝాన్సీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది రజిని, మెహబూబి, మంగమ్మ పాల్గొన్నారు.

## ఎస్సీల సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం

హైద్రాబాద్: తెలంగాణలో ఎస్సీల సమగ్ర అభి వృద్ధికి, కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కట్టుబడి ఉందని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం కుమార్ స్పష్టం చేశారు. ఎస్సీల సంక్షేమ పథకాల సాధన కోసం 'మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి' ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో మహాధర్నా నిర్వహించారు.ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. దళితుల ఆర్థిక సామాజిక సాధికారతకు ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను అమలు చేస్తుందని, ఎస్సీల విద్య ఉపాధి వ్యాపార అవకాశాలను పెంపొందించేందుకు కృషి చేస్తుందన్నారు. ఎస్సీల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని, అంబేద్కర్ ఆశయ సాధనకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ మాట్లాడుతూ ఎస్సీలమం తా ఏకమవుదాం 20% రిజర్వేషన్లపై ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వ ర్యంలో ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో ప్రతి నియోజకవర్గంలోని ఎమ్మెల్యేకి తమ డిమాండ్లను, వినతి పత్రాలను జిల్లా మండల గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే. దాసిమోహన్, రాష్ట్ర యువసేన అధ్యక్షులు యాదగిరి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బొల్లం జ్యోతి, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగారం బాబు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్, వివిధ జిల్లాల అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 4న ఎంజీయూలో మెగా జాబ్ మేళా

నల్లగొండ : నల్లగొండలోని మహాత్మ గాంధీ యూనిర్సిటీలో చదివే విద్యార్థులకు విద్యతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనకే మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వీసీ ప్రొ. ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. ఎంజీయూలో వర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 4న నిర్వహించే 'మెగా జాబ్ మేళా పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జాబ్ మేళాను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వర్సిటీ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డా.హరీశ్ కుమార్ మాట్లాడుతూ.. ఈ జాబ్ మేళాలో ఐటీ, ఫార్మా, అగ్రికల్చర్, బ్యాంకింగ్ వంటి విభిన్న రంగాలకు చెందిన 15 ప్రముఖ కంపెనీలు హాజరవుతున్నట్లు, సుమారుగా ఆయా సంస్థలో 1,500 ఖాళీలు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఎంజీయూ లో ఉదయం 10 గంటలకు జాబ్ మేళా ప్రారంభం అవుతుందని తెలిపారు. యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో యూజీ, పీజీ కోర్సులు చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో పాటు ఇప్పటికే కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు హాజరుకావచ్చని వెల్లడించారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State,
Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State.
Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280